RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి | సంపుటి : 2 సంచిక : 130 | మంగళవారం, జూన్ 25, 2024 | పేజీలు : 4

## ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

హైదరాబాద్: తెలంగాణలో 2023-24 అకాడమిక్ ఇయర్ కు సబంధించిన సప్లిమెంటరీ ఫలితాలను సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు విడుదల చేశారు. ఇంటర్ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్షల్లో మొత్తం 63.86 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఇంటర్ ఒకేషనల్ ఫస్టియర్ విద్యార్థులు 1.62 లక్షల మంది ఉత్తీర్ణులయినట్లు అధికారులు తెలిపారు. ఇక ఇంటర్ ఒకేషనల్ ఫస్టియర్లో 53.24 శాతం, ఒకేషనల్ సెకండ్ ఇయర్ లో 51.12 శాతం, రెగ్యులర్ ఇంటర్ సెకండ్ ఇయర్ లో 43.77 శాతం మంది ఉ త్తీర్ణులయినట్లు తెలిపారు.

## రాజ్‌నాథ్ సింగ్‌తో....

# సీఎం భేటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ వివిధ కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. రాష్ట్రంలో జరగాల్సిన అభివృద్ధి కోసం పలు విజ్ఞప్తులను చేస్తున్నారు. ఈ క్రమంలోనే రేవంత్ రెడ్డి రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను సోమవారం సాయంత్రం కలిశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నందున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజప్తి చేశారు. అలాగే, వరంగల్ లో ఒక సైనిక్ స్కూల్ ఏర్పాటు సహా ఇతర అంశాలను కూడా రాజ్ నాథ్ సింగ్‌కు రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేస్తూ వినతి పత్రం కూడా ఇచ్చారు. వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటువంటి చర్యలు తీసుకోలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.



## హైకోర్టును ఆశ్రయించిన

# కేసీఆర్..



హైదరాబాద్: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోమవారం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. రైలు రోకో సందర్భంగా తనపై నమోదైన కేసుకు సంబంధించి కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రజాప్రతినిధుల కోర్టులో ఉన్న కేసును కొట్టేయాలని ఆ పిటిషన్‌లో కేసీఆర్ కోరారు. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో రైల్ రోకోకు కేసీఆర్ పిలుపునిచ్చారని పోలీసులు నివేదిక అందజేశారు. 2011 అక్టోబర్ 15, 16, 17 తేదీల్లో రైల్ రోకోకు కేసీఆర్ పిలుపునిచ్చారని పోలీసులు వెల్లడించారు. రైలు రోకో కారణంగా రైళ్ల రాకపోకలకు, రైల్వే ఉద్యోగులకు అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. అయితే, తాను ఎలాంటి రైలు రోకోకు పిలుపునివ్వలేదని కేసీఆర్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

# క్షీణిస్తోన్న ఢిల్లీ మంత్రి ఆతిశీ ఆరోగ్యం

న్యూఢిల్లీ : కొంతకాలంగా ఢిల్లీ తీవ్ర నీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో హర్యాణా ప్రభుత్వం దేశ రాజధానికి నీటిని విడుదల చేయాలన్న డిమాండ్‌పై ఒత్తిడి తెస్తూ ఢిల్లీ మంత్రి ఆతిశీ చేపట్టిన దీక్ష నాలుగో రోజుకు చేరుకుంది. సోమవారం ఆమెకు వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు దీక్ష వల్ల ఆమె ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తోందని పేర్కొన్నారు. వెంటనే ఆస్పత్రిలో చేరాలని కోరారు. ఆతిశీ మీడియాతో మాట్లాడుతూ " నా రక్తపోటు , చక్కెర స్థాయిలు పడిపోతున్నాయి. బరువు తగ్గాను. దీనివల్ల భవిష్యత్తులో ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుంది. అయినా నేను ఢిల్లీ ప్రజల తరఫున పోరాడతాను. హర్యానా నీటిని విడుదల చేసే వరకు నిరాహార దీక్షను కొనసాగిస్తాను " అని పేర్కొన్నారు. ఎంత వేడుకున్నా హర్యానా ప్రభుత్వం రోజుకు 100 మిలియన్ గ్యాలన్ల నీటిని కూడా విడుదల చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల దేశ రాజధానిలో 28 లక్షల మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆతిశీ దీక్షకు



మద్దతుగా క్యాండిల్ లైట్ మార్చ్ నిర్వహిస్తామని ఆప్ పేర్కొంది. హర్యానా సిఎం నయాబ్ సింగ్ సైనీని కలిసి తమ సమస్యను పరిష్కరించాలని కోరామని , ఆయన సానుకూలంగా స్పందించారని ఢిల్లీలెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా తెలిపారు.

## 2.70 లక్షల ఇళ్ళు మంజూరు చేయండి...

# కేంద్రానికి సీఎం రేవంత్ వినతి

ఢిల్లీ: తెలంగాణకు 2024-25 ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మోడల్‌లో 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం ఆయన నివాసంలో కలిశారు. రాష్ట్రంలో తాను నిర్మించాలనుకుంటున్న 25 లక్షల ఇళ్లలో 15 లక్షల ఇళ్లు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని, వాటిని లబ్ధిదారుల నేతృత్వంలో వ్యక్తిగత (బీఎల్‌సీ) గృహ నిర్మాణం కింద నిర్మిస్తామని కేంద్ర మంత్రికి వివరించారు. ప్రధానమంత్రి ఆవాస యోజనను (పట్టణ)-పీఎంఏవై (యూ) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం తీసుకున్నందున, 2024-25 సంవత్సరానికి పీఎంఏవై (యూ) కింద మంజూరు



చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని, రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పీఎంఏవై (యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని కేంద్ర మంత్రి ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు. పీఎంఏవై కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి రూ. 2,390.58 కోట్లు గ్రాంటు కింద ప్రకటించారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ. 1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగతా నిధులు విడుదల చేయాలని కేంద్ర మంత్రి ఖట్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. తెలంగాణకు పీఎంఏవై కింద ఇప్పటి వరకు 1,59,372 ఇళ్లు మంజూరు చేశామని, గ్రాంట్ కింద రూ. 2,390.58 కోట్లు ప్రకటించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అయితే ఇప్పటి వరకు రూ. 1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని, మిగిలిన నిధులు కూడా విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ఖట్టర్‌ను కోరారు.

## ఫస్ట్ హీరోయిన్‌తో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్..

అమరావతి: పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన తొలి సినిమా 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి'. నాగార్జున మేనకోడలు సుప్రియ కూడా ఈ సినిమాతోనే ఇండస్ట్రీకి హీరోయిన్‌గా పరిచయమైంది. అయితే మొదటి సినిమా తర్వాత సుప్రియ సినిమాల నుంచి తప్పుకుంది. అన్నపూర్ణ స్టూడియో బాధ్యతలు చూసుకుంటూ.. నిర్మాతగా ఎన్నో చిత్రాలను నిర్మించారు. ఇటీవల జరిగిన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించింది. ఏపీ డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఈరోజు (సోమవారం) విజయవాడలోని క్యాంప్ ఆఫీస్ లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో టాలీవుడ్ నిర్మాతలు సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సుప్రియ కూడా పాల్గొన్నారు. ఎన్నికల్లో గెలిచి డిప్యూటీ సీఎం అయినందుకు పవన్ కల్యాణ్‌కు సుప్రియ అభినందనలు తెలిపారు.




## రాజ్యసభ నాయకుడుగా జెపి నడ్డా



న్యూఢిల్లీ: భారతీయ జనతా పార్టీ (బిజెపి) అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాను రాజ్యసభలో సభా నాయకునిగా నియమించినట్లు అధికార వర్గాలు సోమవారం ప్రకటించాయి. పీయూష్ గోయల్ స్థానంలో నడ్డా నియామకం జరిగింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన గోయల్ సోమవారం దిగువ సభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు. నడ్డా కాకుండా కేంద్ర మంత్రి మండలిలోని మరి 11 మంది ఎగువ సభలో సభ్యులుగా ఉన్నారు,

## కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతాం: మోడీ




ఢిల్లీ: లోక్ సభ 2047 వికసిత్ భారత్ సంకల్పం, కొత్త లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగుతామని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. కొత్త పార్లమెంటు భవనంలో లోక్ సభ సమావేశాలు సందర్భంగా మోడీ మాట్లాడారు. లోక్ సభ సభ్యులకు పిఎం మోడీ స్వాగతం పలికారు. ఇది చాలా పవిత్రమైన రోజు అని పేర్కొన్నారు. 140 కోట్ల ప్రజల ఆకాంక్షలు నెరవేరస్తామని, సామాన్య ప్రజల కలలు సాకారం చేస్తామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు కృషి చేస్తామన్నారు. మూడోసారి సేవచేసే భాగ్యాన్ని ప్రజలు కల్పించారని, సభ్యులందరినీ కలుపుకొని వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకుంటామని మోడీ వివరించారు. ప్రజలు మా విధానాలను విశ్వసించారని, సరికొత్త విశ్వాసంతో కొత్త సమావేశాలు ప్రారంభిస్తున్నామని, రాజ్యాంగానికి గౌరవం ఇచ్చి నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల స్వప్నం నెరవేర్చే సంకల్పం తీసుకున్నామని, రేపటితో అత్యయిక పరిస్థితి 50 ఏళ్లు పూర్తివుతుందని, అత్యయిక పరిస్థితి ఒక మచ్చ అని, 50 ఏళ్ల క్రితం జరిగిన పొరపాటు పునరావృతం కాకూడదని మోడీ తెలిపారు.

## మూడోసారి లోక్ సభ్యుడిగా...

# ప్రధాని నరేంద్ర మోడీ ప్రమాణం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన మంత్రివర్గ సహచరులు 18వ లోక్‌సభ సభ్యులుగా సోమవారం ప్రారంభమైన తొలి సమావేశంలో ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలలో మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రధానిగా ఈ నెల 9వ తేదీన ప్రమాణం చేశారు. ఆయనతోపాటు ఆయన మంత్రివర్గ సభ్యులు కూడా అదే రోజు ప్రమాణం చేశారు. వారణాసి నుంచి వరుసగా మూడుసార్లు గెలిచిన ప్రధాని మోడీ సభా నాయకుడిగా సోమవారం అందరికన్నా ముందుగా ప్రమాణం చేశారు. అధికార పక్ష సభ్యులు జైశ్రీరాం అని నినాదాలు చేస్తుండగా మోడీ హిందీలో లోక్‌సభ సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాగా..మోడీ ప్రమాణం చేస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు రాజ్యాంగం ప్రతులను చేతుల్లో పట్టుకుని నిలబడ్డారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రమాణం చేస్తున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు తమ సీట్లలో మౌనంగా కూర్చుని చేతిలోని రాజ్యాంగ ప్రతులను ప్రదర్శించారు. మంత్రివర్గ సభ్యులలో విదేశఖు వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాజ్యసభ సభ్యులు కాగా సహాయ మంత్రులు జార్జి కురియన్, రవనీత్ సింగ్‌కు ఏ సభలోను సభ్యత్వం లేదు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రోడ్డు రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ 18వ లోక్‌సభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లోని లక్నో నుంచి రాజ్‌నాథ్ సింగ్ మరోసారి ఎన్నిక కాగా గుజరాత్‌లోని గాంధీ నగర్ నుంచి అమిత్ షా, మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి నితిన్ గర్కరీ మరోసారి ఎన్నికయ్యారు. ఈ ముగ్గురూ హిందీలో ప్రమాణం చేశారు. వీరికి ముందు ప్రొటెమ్ స్పీకర్‌కు సహాయపడేందుకు ఎంపికైన సీనియర్ సభ్యులు రాధామోహన్ సింగ్, ఫగన్ సింగ్ కులస్తే(ఉభయులూ బిజెపి సభ్యులు)నూతన లోక్‌సభ సభ్యులుగా ప్రమాణం చేశారు. సోమవారం, మంగళవారం రెండు రోజులపాటు జరిగే సభ్యుల ప్రమాణ స్వీకారంలో ప్రొటెమ్ స్పీకర్ భర్తృహరి మహతాబ్‌కు వీరు సహాయపడతారు.



## సంపాదకీయం

# తెలుగు భాషకు దివాకర్ల సేవలు..!

అభినవ 'నన్నయ'లా భావించబడి, సంప్రదాయ సాహిత్యానికి అండగా నిలిచి, మహామహోపన్యాస కునిగా పేరొంది అధిక శిష్య సంపదను పొందిన సాహితీమూర్తి ఆచార్య దివాకర్ల వెంకటావధాని. దివాకర్ల వేంకటావధాని (జూన్ 23, 1911 – అక్టోబరు 21, 1986) పరిశోధకుడు, విమర్శకుడు. దివాకర్ల వంశంలో పరీధావి నామ సంవత్సరం, ఆషాఢ పౌర్ణమి నాడు ఆకుతీగపాడు గ్రామంలో అమ్మమ్మ ఇంట్లో జన్మించారు. జన్మనక్షత్రం మూల. హరితస గోత్రుడు. వెలనాటి వైదిక బ్రాహ్మణుడు. కృష్ణ యజుర్వేద శాఖకు చెందినవాడు. ఇతని తండ్రి పేరు సుందర రామయ్య, తల్లి పేరు వేంకమ్మ. పశ్చిమ గోదావరి జిల్లా, ఉండి మండలం యండగండి ఇతని స్వగ్రామం. తిరుపతి వేంకట కవులలో ఒకరైన దివాకర్ల తిరుపతిశాస్త్రి ఆయన పినతండ్రి. దివాకర్ల వేంకటావధానికి ఒక తమ్ముడు, ముగ్గురు చెల్లెళ్లు. ఇతడే ఇంటికి పెద్దకొడుకు. బాల్యంలోనే ఇతని ప్రతిభాపాటవాలు వెలుగు చూశాయి. సహజ ధారణాశక్తితో చిన్నప్పుడే తిరుపతి వేంకటకవుల అవధాన పద్యాలను కంఠస్థం చేశారు. ఎనిమిదవ తరగతి చదివే సమయంలోనే ఆయన పద్యాలు భారతి మాసపత్రికలో ప్రచురితమయ్యాయి. ఇంట్లోనే తన తండ్రి వద్ద సంస్కృతం నేర్చుకున్నారు. రఘువంశం, ఆంధ్రనామ సంగ్రహం చదువుకున్నారు. తన గ్రామం యండగండిలో ఏడవ తరగతి వరకు చదివారు. ఆ తర్వాత ఉండిలో సంస్కృతం ప్రథమ భాషగా, తెలుగు ద్వితీయ భాషగా ఉన్నతపాఠశాల విద్య చదివారు. అనంతరం 1930-31లో బందరు హిందూ కళాశాలలో ఇంటరు చదివారు. ఆ సమయంలో విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లో వుంటూ పేదరికం కారణంగా వారాలు చేసి చదువు కున్నారు. విశ్వనాథకు ప్రియశిష్యుడిగా వుండి అతడి ఏకవీర నవలను చెబుతుండగా దివాకర్ల వేంకటావధాని వ్రాసేవారు. విశ్వనాథ, కొడాలి వెంకట సుబ్బారావుల ప్రోద్బలంతో విశాఖ పట్టణం వెళ్లి ఆంధ్ర విశ్వ విద్యాలయంలో బి.ఏ. (ఆనర్సు) చేరారు. అక్కడ పింగళి లక్ష్మీకాంతం, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి, గంటి జోగి సోమయాజి ఆయనకు గురువులు. పాటిబండ మాధవశర్మ ఇతని సహాధ్యాయి. బి.ఏ. తరువాత ధర్మవరం రామకృష్ణమా చార్యులు గురించి విమర్శావ్యాసం వ్రాసి ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి మొట్ట మొదటి ఎం.ఏ (ఆనర్సు) పట్టాను పొందారు. తెన్నేటి విశ్వనాథం దగ్గర ఆంగ్లభాషా పరిజ్ఞానం సంపాదించారు. 1942 ప్రాంతాలలో వేదాధ్యయనం మొదలు పెట్టి, మహావ్రత చయనులు వద్ద నమక చమకాలను, దశశాంతులు మొదలైన వాటిని వల్లెవేశారు. 1957లో ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఖండవల్లి లక్ష్మీరంజనం పర్యవేక్షణలో ఆంధ్ర వ్మాయారంభ దశ – నన్నయ భారతము అనే విషయంపై పరిశోధన చేసి పి.హెచ్.డి పట్టాను సాధించారు. 1934లో అప్పటి ఆంధ్ర విశ్వ విద్యాలయం ఉపకులపతి డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ దివాకర్ల ను విశాఖపట్టణం లోని మిసెస్ ఏ.వి.ఎన్.కళాశాలలో తెలుగు పండితుడిగా నియమించారు. తరువాత పదోన్నతి పొంది అదే కళాశాలలో ఉపన్యాసకులుగా పనిచేశారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్‌కు అధ్యక్షుడిగా నియమింప బడ్డారు. 1951లో హైదరాబాదులోని ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఆంధ్రోపన్యాసకులుగా చేరారు. 1957లో రీడర్‌గా, 1964లో ప్రొఫెసర్‌గా, తెలుగు శాఖాధ్యక్షుడిగా పదోన్నతి పొందారు. 1974-1975ల మధ్య కాలంలో ఎమినెంట్ ప్రొఫెసర్‌గా, 1975 నుండి 1978 వరకు యు.జి.సి.ప్రొఫెసరుగా పదవీ బాధ్యతలు నిర్వహించారు. ఇతడి పర్యవేక్షణలో 15మంది పి.హెచ్.డి, ఒకరు ఎం.ఫిల్ పట్టాలను పొందారు. ఇతని శిష్యగణంలో ఎం.కులశేఖరరావు, ఇరివెంటి కృష్ణమూర్తి, పి.యశోదారెడ్డి, సి.నారాయణరెడ్డి, ముద్దసాని రామిరెడ్డి మొదలైన వారు ఉన్నారు. దివాకర్ల నలభైకి మించి గ్రంథాలను రచించారు. వాటిలో పద్యకృతులు, వచన రచనలు, విమర్శలు, వ్యాఖ్యానాలు, అనువాదాలు, టీకాతాత్పర్యాలు ఉన్నాయి. ఖండవల్లి లక్ష్మీరంజనంతో కలిసి ఆంధ్ర మహాభారత సంశోధిత ముద్రణకు విపులమైన పీఠిక వ్రాశారు. తెలంగాణలోని మారుమూల గ్రామాలకు పిలవగానే వెళ్లి ఉపన్యాసాల ద్వారా అక్కడి ప్రజలకు తెలుగు భాషాసాహిత్య చైతన్యాన్ని కలిగించారు. అనేక కవిపండితుల గ్రంథాలకు చక్కని పీఠికలను, సమగ్ర సమీక్షలను అందించి వారిని ప్రోత్సహించారు. ఆయనకు అనేక సాహిత్య సంస్థలతో సంబంధం ఉండేది. వాటిలో ఆంధ్ర సారస్వత పరిషత్తు, యువభారతి, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ, సంస్కృత భాషా ప్రచార సమితి, ఆర్ష విజ్ఞాన సమితి, సురభారతి, కళాస్రవంతి అనేవి కొన్ని. ఆయన ఉపన్యాసాలకు జనం వేలకొలది వచ్చేవారు. వసుచరితము గురించి ఇతడు ఉపన్యసిస్తుంటే శ్రోతలు వర్షంలో గొడుగులు పట్టుకుని నిలబడి ఉపన్యాసం విన్నారంటే ఇతని ఉపన్యాస కళ ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు. దివాకర్ల సుమారు 15 అవధానములు చేశారు. విద్యార్థిగా ఉన్నపుడు బందరు హిందూ కళాశాలలో మొదటి అవధానం చేశారు. తరువాత ఉండి, మొదటి ప్రపంచ తెలుగు మహా సభలలో (హైదరాబాదు), ఆకాశ వాణిలో, విద్యుత్‌సౌధ (హైదరాబాదు) లో, కాకినాడ తదితర ప్రాంతాలలో అవధానాలు నిర్వహించారు.

## విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేసిన సింజంట్ కంపెనీ




**శామీర్ పేట, (గరుడ వార్త) :** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సింజంట్ కంపెనీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. సోమవారం మూడు చింతలపల్లి మండలం కొల్తూర్ పరిధిలోని సింజంట ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీవారి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హరిజనవా ప్రాథమిక పాఠశాల, గ్రామపంచాయతీ వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు బ్యాగులను అంద చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శిల్పా యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింగారావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరి శంకర్, రమాదేవి, మాజీ ఎంపిటిసి బొగ్గుల వెంకటేష్, కంపెనీ ప్రతినిధులు సుందర్ రెడ్డి, నారాయణ బట్, అంజన, అలోక్, సుందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌కు 4వ తరగతి విద్యార్థుల మండల స్థాయి ఎంపిక పోటీల నిర్వహణ






**శామీర్ పేట, (గరుడ వార్త) :** తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు 4వ తరగతి విద్యార్థుల మండల స్థాయి ఎంపికకు గాను పోటీలు నిర్వహించారు. సోమవారం మండల కేంద్రం శామీర్ పేట మినీ స్టేడియంలో శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాల పరిధిలోని పలు పాఠశాలల విద్యార్థులు ఈ ఎంపిక పోటీలలో పాల్గొన్నారు. ఎంఈఓ వసంత కుమారి ఆదేశాల మేరకు పి ఈ టి లు ఈ పోటీలను నిర్వహించారు. స్పోర్ట్స్ స్కూల్ 4వ తరగతికి అడ్మిషన్ లకు క్రీడా పోటీలను చేపట్టారు. ఇందులో శామీర్ పేట మండల స్థాయిలో 9 మంది ఎంపిక కాగా మూడు చింతల మండలానికి ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొననున్నట్లు పిఈటిలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఈ టి లు సత్తిరెడ్డి, సునీల్, శ్వేత, రాధికా రెడ్డి, వరలక్ష్మి, శ్రీనివాస్, గోపాల్ చారి తదితరులు పాల్గొన్నారు.

## బొగ్గు చుట్టూ తిరుగుతున్న రాజకీయం

**హైదరాబాద్:** తెలంగాణ రాజకీయం అంతా ఇప్పుడు బొగ్గు చుట్టూ తిరుగుతోంది. తెలంగాణలోని బొగ్గు గనులు సింగరేణికి కేటాయించకుండా కేంద్రం వేలం వేసింది. ఈ వేలం ప్రక్రియలో తెలంగాణ ప్రభుత్వం కూడా పాల్గొన్నది. అందుకే బీఆర్ఎస్ నేతలు విరుచుకుపడుతున్నారు. సింగరేణి ప్రైవేటీకరణకు కాంగ్రెస్, బీజేపీ కలిసి కుట్ర చేస్తున్నాయని కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. తమ హయాంలో బొగ్గు బ్లాకుల వేలాన్ని తీవ్రంగా వ్యతిరేకించామని సింగరేణిని కూడా వేలంలో పాల్గొనడానికి అంగీకరించలేదని బీఆర్ఎస్ వాదిస్తోంది. అయితే ఈ విషయంపై కాంగ్రెస్ భిన్నంగా స్పందిస్తోంది. వేలంలో పాల్గొనకుండా సింగరేణికి నష్టం చేశారని కోల్ బ్లాకులు బీఆర్ఎస్ నేతల సన్నిహితులుక చెందడానికే ఇలా చేశారంటున్నారు. సింగరేణికి ప్రస్తుతం ఉన్న బొగ్గు గనులు మరో పదేళ్లలో అయిపోతాయని ఆ తర్వాత పరిస్థితేమిటని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రశ్నించారు. వేలంలో అయినా బొగ్గు గనులు దక్కించుకోవాలని.. తర్వాత కేంద్రంపై పోరాడి .. దొరికిన గనులు కేటాయింప చేసుకోవాలని కాంగ్రెస్ వాదిస్తోంది. బీఆర్ఎస్ వల్లే సింగరేణికి పెను ముప్పు ఏర్పడిందని అంటోంది. సింగరేణి ప్రభుత్వ సంస్థ. తెలంగాణ ప్రభుత్వానికి 51 శాతం, కేంద్రానికి 49 శాతం వాటాలున్నాయి. అంటే వంద శాతం ప్రభుత్వ సంస్థ. బొగ్గు గనులు వీటికి కేటాయించడం అంటే ప్రభుత్వానికి కేటాయించడమే అనుకోవచ్చు. కానీ కేంద్రం.. ప్రైవేటు సంస్థలతో పాటు సింగరేణి కూడా పోటీ పడి బొగ్గు గనులు దక్కించుకోవాల్సిందేనని విధాన నిర్ణయం తీసుకుంది. దేశంలో ఉన్న బొగ్గు గనులన్నింటినీ వేలం వేస్తూ వస్తోంది. దేశంలోని సుమారు 500 బొగ్గు బ్లాకుల్లో ఇప్పటికే 300 బ్లాకుల వేలం పాట పూర్తయింది. ఈ విధానం వల్ల రాష్ట్రాలకు ఆదాయం పెరుగుతుందని కేంద్రం చెబుతోంది. తెలంగాణలో ఉన్న బొగ్గు గనులు గతంలో సింగరేణికే కేటాయించేవారు. కానీ కేంద్రం వేలం నిర్ణయం తీసుకున్న తర్వాత సింగరేణి కూడా వేలంలోనే గనులు దక్కించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాజాగా హైదరాబాద్‌లో శ్రావణపల్లి బ్లాకు వేలం ప్రక్రియ జరిగింది. శ్రావణపల్లి బ్లాకులో 11.99 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలున్నట్టు గతంలో సింగరేణి నిర్వహించిన భూగర్భ సర్వేలో తేలింది. సింగరేణి ఏరియాలో ఉన్న ఈ బొగ్గు బ్లాకును వేలం వేయకుండా, నేరుగా సింగరేణికే కేటాయించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిమాండ్ చేసినా.. కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. కేంద్రం ఇంతకుముందు పలు దఫాలుగా సింగరేణి ఏరియాలోని కల్యాణఖని, శ్రావణపల్లి, కోయగూడెం, సత్తుపల్లి బొగ్గుబ్లాకులకు వేలం నిర్వహించింది. అప్పుడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కారు ఆ వేలాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. వేలంలో పాల్గొనలేదు. ఫలితంగా ఆ బొగ్గు గనులు సింగరేణికి దక్కలేదు. వేలంలో ఇతరులకు దక్కాయి.

## అక్రమాల గూడెం




**హైదరాబాద్:** మోదీ వస్తే ఈడీ వస్తుంది.. ఎన్నికల సమయంలోనే ఈడీ దాడులు చేస్తుంది.. విపక్షాల గొంతు నొక్కేందుకు కేంద్రం దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తుంది.. ఇదీ ఆరునెలల క్రితం వరకు బీఆర్ఎస్ నేతలు కేంద్ర దర్యాప్తు సంస్థలు ఈడీ, సీబీఐపై, కేంద్రంపై చేసిన ఆరోపణలు. కానీ ఇప్పుడు ఎన్నికలు పూర్తయ్యాయి. మోదీ రాష్ట్రానికి రాలేదు.. కానీ ఈడీ వచ్చింది. కారణం పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ఆయన సోదరుడు మధుసూదన్‌రెడ్డి మైనింగ్ పేరుతో చేసిన అక్రమాల గుట్టు తేల్చబోతోంది. అక్రమ మైనింగ్‌తో ప్రభుత్వానికి రూ.39 కోట్ల నష్టం నష్టం కలిగించారు. ఈ లెక్క తేల్చేందుకు ఈడీ మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డితోపాటు బంధువుల ఇళ్లు, కార్యాలయాలపై దాడులు చేసింది. ఇక మొదట రూ.39 కోట్ల అక్రమాలు జరిగాయని ఈడీ భావించగా, దాడుల తర్వాత ఈడీకి దిమ్మ తిరిగి బొమ్మ కనిపించింది. పత్రాలు, కంప్యూటర్లు, రికార్డులు పరిశీలించిన తర్వాత రూ.300 కోట్లకుపైగా అక్రమాలు జరిగినట్లు ఈడీ అధికారులు అధికారికంగా వెల్లడించారు. సంతోష్ సాండ్, సంతోష్ గ్రానైట్ కంపెనీల ద్వారా ఈ అక్రమాలు కొనసాగించారని ఈడీ పేర్కొంది. ఇక ఈడీ దాడుల సమయంలో రూ.19 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. దాడుల వివరాలతో ఈడీ అధికారిక ప్రకటన విడుదల చేసింది. మహిపాల్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి మనీ లాండరింగ్, హవాలా మార్గాల్లో అక్రమాలకు పాల్పడినట్లు అందిన ఫిర్యాదు మేరకు దాడులు చేసినట్లు ఈడీ అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల్లో కూడా అక్రమ లావాదేవీలు గుర్తించినట్లు పేర్కొన్నారు. అక్రమ మార్గంలో పెద్దమొత్తంలో డబ్బును స్థిరాస్తి రంగంలో పెట్టుబడి పెట్టినట్లు ఈడీ వెల్లడించింది. ఇంకా కొన్ని బ్యాంకు లాకర్లు తెరవాల్సి ఉందని తెలిపింది. ఇక గూడెం బ్రదర్స్ అక్రమ దందాలను బినామీల పేరిట చేసినట్లు ఈడీ గుర్తించింది. వారి వివరాలు సేకరించే పనిలో కూడా ఈడీ ఉంది. తమ పేర్లు బయటకు రాకుండా ఉండేందుకే పలువురు బినామీల పేరిట వ్యాపారాలు చేస్తున్నట్లు గుర్తించారు. బినామీల ఖాతాలు, ఇళ్లలోనూ సోదాలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే.. గూడెం సోదరులను బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు వెనకేసుకొచ్చారు. తమ ఎమ్మెల్యే ఎలాంటి తప్పు చేయలేదని క్లీన్‌చిట్ ఇచ్చారు. ఈడీ కక్షపూరితంగా దాడులు చేస్తోందని ఆరోపించారు. ఐటీ చెల్లిస్తూనే వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించారు. కానీ, ఈడీ అధికారికంగా పద్దుకున్న డబ్బులు, గుర్తించిన అక్రమాల వివరాలను వెల్లడించింది.

## మైలార్ దేవ్ పల్లి లో రెచ్చిపోయిన గంజాయి గ్యాంగ్



**రంగారెడ్డి:** మైలార్ దేవ్ పల్లిలో గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. ఓ హెయిర్ సెలూన్ పై దాడి. సెలూన్ లో ఉన్న ఫర్నీచర్ ధ్వంసం చేసారు. యజమాని పై విచక్షణారహితంగా పిడుగుద్దుల వర్షం కురిపించారు. ముగ్గురు గంజాయి గ్యాంగ్ గాళ్లు సెలూన్ కు వచ్చి హెయిర్ కట్టింగ్ చేయించుకున్నారు. డబ్బులు అడిన పాపానికి యజమాని పై దాడిచేసారు. మా దగ్గర డబ్బులు అడుగుతావా అంటూ రెచ్చిపోయి హంగామా చేసారు గంజాయి మత్తులో నానా హంగామా చేసారు. అడ్డు వచ్చిన స్థానికుల పై దాడి కి దిగా,రు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చే లోపు అక్కడి నుండి పరారైయారు. గంజాయి గ్యాంగ్ తో ఏగలేక పోతున్నామంటున్న స్థానికులు, గంజాయి మత్తులో కాలనీ వాసులపై దాడి చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

## అభిమానులతో సరదాగా చిందులేసిన తిరువూరు ఎమ్మెల్యే



**మేడ్చల్:** హైదరాబాద్ నాచారం లో తిరువూరు నియోజకవర్గం ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు టిడిపి అభిమానులు అభినందన సభ ఏర్పాటు చేశారు . ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కొలికపూడీ శ్రీనివాసరావు హైదరాబాద్ రావడంతో నాచారంలో శేషగిరి రావు ఆధ్వర్యంలో టిడిపి అభిమానులు ఘన స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు అభిమానులతో కలిసి డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో టిడిపి జనసేన బిజెపి కూటమి ఘన విజయం సాధించి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో నూతన ప్రభుత్వం ఏర్పడి ఆంధ్రప్రదేశ్ అమరావతి పునర్మాణం అవుతుందన్నారు. గత ఐదు సంవత్సరాలు జగన్మోహన్ రెడ్డి అరాచక పాలన నుండి ఆంధ్రప్రదేశ్ కాపాడే లక్ష్యంగా ఏదైతే పవన్ కళ్యాణ్ ఓట్లు చీలకూడదని లక్ష్యంతో రాజకీయంగా అన్ని సర్దుబాటు చేసుకొని కూటమి భారీ మెజార్టీతో 164 స్థానాలలో ఎమ్మెల్యేలతో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డదన్నారు. ఈ నేపద్యంలో కూటమి ప్రభుత్వం ముందు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయన్నారు. అమరావతి నిర్మాణం, పోలవరం నిర్మాణం పూర్తి లక్ష్యాలతో అన్ని ప్రాంతాల అభివృద్ధి అన్ని వర్గాల సంక్షేమం కోసం కూటమి పనులు చేస్తుందని తెలిపారు

## వరంగల్ వర్షాల కోసం పూజలు



**వరంగల్:** తెలంగాణలో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు కురిసినా కొన్ని వరంగల్.. సిద్ధిపేట జిల్లాలో వర్షాలు కురవలేదు. వర్షాభావ పరిస్థితులు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. దీంతో వర్షాలు కురవాలని వరంగల్ జిల్లాలో వర్షాల కోసం ప్రత్యేక పూజలు చేస్తున్నారు. హనుమకొండలోని పద్మాక్షి కాలనీలో పోచమ్మతల్లి, కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు, జలాభిషేకాలు చేశారు మహిళలు. విస్తారంగా వర్షాలు కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని, పిల్లాపాపలతో సుఖంగా ఉండాలని మహిళలు నీళ్ల బిందెలు ఎత్తుకొని ఆలయాలకు చేరుకుని విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. పసుపు-కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. పౌర్ణమి రోజున పోచమ్మకు ప్రత్యేక పూజలు చేస్తే వర్షాలు కురుస్తాయని గ్రామస్తులు ప్రగాఢంగా నమ్ముతున్నారు. గతంలోనూ ఇలాంటి పూజ చేయడం వల్ల తమ మొక్కులు ఫలించయంటున్నారు మహిళలు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు నష్టపోతున్నామని.. ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిద్ధిపేట జిల్లాలోను వర్షాల కోసం కప్పల పెళ్లి నిర్వహించారు. రెండు కప్పలకు పసుపు నీళ్లతో స్నానం చేయించి, మంత్రోచ్ఛారణల మధ్య ఆ రెండు కప్పులకు అందరూ చూస్తుండగా వివాహం జరిపించారు. ఈ ఆచారంలో భాగంగా మహిళా రైతులు కప్పలకు నీళ్లు పోస్తుంటే పిల్లలు కర్రకు కట్టిన కొత్తగా పెళ్లయిన కప్పల జంటను తీసుకొని గ్రామమంతా తిరిగారు.

## ప్రజావాణి మొత్తం ధరఖాస్తులు.. 71 - అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్

**సిద్దిపేట:** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఆద్వర్యంలో ప్రజావాణి కార్యక్రమ నిర్వహణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు పరిష్కరించుకొవడానికి అర్జిదారులు ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కి అర్జి పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ప్రజావాణి అనేది గొప్ప కార్యక్రమం. సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకొవడానికి ఒక చక్కని వేదిక ఈ ప్రజావాణి. సమస్యలు పట్టుకుని ఎంతో నమ్మకం తో కార్యాలయం కి వచ్చిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేసే విధంగా పని చేయ్యాలని జిల్లా అధికారులకు తెలిపారు. భూ సంబంధిత, రెండు పడక గదుల ఇళ్ళు, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 71 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జిల్లా అదన కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్ రెడ్డి, డిఆర్ఓ నాగరాజమ్మ, డిఆర్డిఏ పిడి జయదేవ్ ఆర్య, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

========================

## శనిగరం జలాశయాన్ని సందర్శించిన కలెక్టర్ మను చౌదరి

**కోహెడ:** శనిగరం జలాశయాన్ని జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ జలాశయం 1 టిఎంసి నీటి సామర్థ్యంతో కోహెడ, బెజ్జంకి మండలాల్లో 5100 ఎకరాలకు సాగునీరు అందించడం అలాగే ఇటీవల 2 కోట్ల 78 లక్షల నిర్మాణ వ్యయంతో స్క్రీన్ వాల్ నూ నిర్మించామని ఇరిగేషన్ శాఖ అధికారులు మ్యాపును చూపిస్తూ కలెక్టర్ కు తెలిపారు. జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఈ మధ్య తరహా జలాశయం రెండు మండలాలలో సుమారు 10 గ్రామాలకు సాగునీరు అందించే ఈ జలాశయాన్ని రక్షణకు సంబంధించి ప్రభుత్వం నుండి అన్ని విధాల సహకారం ఉంటుందని తెలిపారు. ఈ జలాశయం కు నాచురల్ ఫ్లో ఉన్నందున భారీ వర్షాలు కురిసినప్పుడు జలాశయాన్ని ఇరిగేషన్ శాఖ అధికారులు ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలి. ఎక్కడ ఎలాంటి సమస్య ఏదైనా తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే నీరు మత్తడి నుండి దూకే క్రమంలో పర్యటకులకు లోనికి పోకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. కలెక్టర్ వెంట ఇరిగేషన్ శాఖ డీఈ విద్యాసాగర్ కోహెడ తాసిల్దార్ సురేఖ తదితరులు ఉన్నారు.

======================

## పార్టీ మారుతున్న వారిపై బీఆర్ఎస్ న్యాయపోరాటం


**హైదరాబాద్:** పార్టీ మారుపోతున్న ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ ఆపలేకపోతోంది. బుజ్జగింపుల ద్వారా సాధ్యం కావడం లేదు కాబట్టి.. వారిలో అనర్హతా వేటు భయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో పార్టీ మారిన వారందరిపై అనర్హతా వేటు వేయించేందుకు సుప్రీంకోర్టుకైనా వెళ్లేందుకు వెనుకాడేది లేదని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ సీఎం కేసీఆర్, కేటీఆర్ లకు అత్యంత సన్నిహితులైన వారు పార్టీ వీడిపోతున్నారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివసారెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం బీఆర్ఎస్ అగ్రనేతలకు ఊహించని షాక్ లాంటిది. వారిని అత్యంత నమ్మకస్తులుగా కేసీఆర్ భావిస్తారు. జగిత్యాల సంజయ్ కుమార్ గెలుపును కల్వకుంట్ల కవిత రెండు సార్లు తన సొంత గెలుపుగా భావించి పని చేశారు. ఆయన కూడా పార్టీ మారిపోవడంతో ఇక రాజకీయాల్లో విశ్వసనీయతకు అర్థం లేదని అనుకుంటున్నారు. అంతకు ముందే కడియం శ్రీహరి, దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు వంటి వారు కాంగ్రెస్ లో చేరిపోయారు. వారందిరపై అనర్హతా వేటు వేయించేందుకు న్యాయస్థానాల్ని ఆశ్రయిస్తున్నారు బీఆర్ఎస్ అగ్రనేతలు. సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు ప్రకారం మూడు నెలల్లో అనర్హత పిటిషన్ పైన స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ వాదిస్తోంది. దానం నాగేందర్ పార్టీ మారినప్పుడు ఆయనపై స్పీకర్ కార్యాలయంలో పార్టీ ఫిరాయింపు పిర్యాదు ఇచ్చారు. తర్వాత హైకోర్టులోనూ పిటిషన్లు వేశారు. వాటిపై విచారణ జరగాల్సి ఉంది. మరో వైపు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు వరుసగా పార్టీ మారిపోతున్నారు. కేసీఆర్ కుటుంబానికి అత్యంత నమ్మకస్తులైన వారిపై వచ్చే ఒత్తిళ్లు తీవ్రంగా ఉంటాయి కాబట్టి.. మూడో కంటికి తెలియకుండా కండువా కప్పేస్తున్నారు. మిగిలిన ఎమ్మెల్యేలు అందర్నీ ఢిల్లీకి పిలిపించి కండవాలు కప్పుతారని.. బీఆర్ఎస్ఎల్పీని విలీనం చేస్తారని అంటున్నారు. అలాంటి పరిస్థితి రాకుండా అనర్హతా వేటు అస్త్రాన్ని బీఆర్ఎస్ ప్రయోగిస్తోంది. అయితే పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం స్పీకర్ దే తుది నిర్ణయం. స్పీకర్ ఫలానా నిర్ణయం తీసుకోవాలని.. లేదా ఫలానా తేదీలోపు నిర్ణయం తీసుకోలేవని నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్ర విషయంలో అక్కడ పార్టీల్లో చీలిక వచ్చిందని ఈ కారణంగా ఏ పార్టీ వారు ఏ పార్టీలో చేరారన్నది స్పీకర్ తేల్చలేకపోవడం వల్ల మూడు నెలల గడువు పెట్టారని అంటున్నారు. మామూలుగా అయితే అధికార పార్టీల్లో చేరే ఎమ్మెల్యేలపై అనర్హతకు సంబంధించి స్పీకర్లు నిర్ణయాలు తీసకోవడం లేదు. అధికార పార్టీ వ్యూహంలోనే భాగంగానే వారు పార్టీలో చేరుతున్నారు. అయితే న్యాయపోరాటం చేసి అయినా సరే వాళ్లను మాజీలను చేయాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది.

================

## ఇంటర్ ఫలితాలు రిజల్ట్స్ రిలీజ్

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఇంటర్ బోర్డు సోమవారం (జూన్ 24) ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను విడుదల చేసింది. జూన్ 24న మధ్యాహ్నం 2 గంటలకు ఫలితాలను విడుదల చేసినట్లు రాష్ట్ర ఇంటర్ బోర్డు వెల్లడించింది. రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ బుర్ర వెంకటేశం ఫలితాలు విడుదల చేశారు. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ రెండింటినీ ఒకేసారి విడుదల చేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్ నుంచి ఫలితాలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తాజా ఫలితాల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 63.86 శాతం ఉత్తీర్ణత నమోదవగా.. సెకెండ్ ఇయర్‌లో 43.77 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఆయా తేదీల్లో రెండు పూటలా నిర్వహించారు. ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షల అనంతరం జూన్ 4 నుంచి 8వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహించారు. కాగా ఈ ఏడాది మే, జూన్ నెలల్లో జరిగిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

# 'విశ్వ'విద్యకు పూర్వవైభవం దక్కేనా.....!



విశ్వవిద్యాలయాలు' మానవత్వానికి, సహనానికి, తర్కానికి, సాహసోపేత ఆలోచనలకు, సత్యశోధనాల కోసం నిలబడాలని ఆనాడు దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆకాంక్షించినట్టే.. స్థానిక అంశాలకు అనుగుణంగా పరిశోధనలు జరగాలన్నా..విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పాలన్నా, ఉన్నత విద్యావకాశాలు ఉచితంగా దక్కాలన్నా..చైతన్యవంతులైన పౌరులతో పాటు సామాజిక బాధ్యత కలిగిన నాయకులను తయారుచేస్తూ..సమాజ ప్రగతి జరగాలన్నా ఆ ప్రాంతంలో 'విశ్వవిద్యాలయం' అందుబాటులో ఉండటం అత్యంత కీలకం. అందుకే ఏ రాష్ట్రంలోనైనా ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుంటారు. మౌలిక వసతులు, నైపుణ్యాలను మెరుగుపరుస్తూ, బోధనను సులభతరం చేసేలా విస్తృత స్థాయిలో నియామకాలు చేపడుతుంటారు. కానీ, తెలంగాణ రాష్ట్రానికి వచ్చేసరికి ఈ విషయం తారుమారైంది. గత పదేళ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రంలో విశ్వవిద్యాలయ విద్యను పూర్తిగా విధ్వంసం చేసింది. ఉస్మానియా, కాకతీయతో పాటు అప్పటికే ఉన్న 15 విశ్వవిద్యాలయాల నిర్వహణకు, సంక్షేమానికి నిధులు కేటాయించలేదు. పైపెచ్చు ఇన్చార్జిల రెండేళ్ల పాలన కారణంగా నాణ్యతా ప్రమాణాలు పూర్తిగా పడిపోయాయి. అనంతరం కొత్తగా వీసీలను నియమించినా.. పనితీరులో నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలు, నిధుల లేమి.. వెరసి పూర్వవైభవం కోల్పోయే దుస్థితికి దిగజారాయి. ఫలితంగా కేంద్ర ఉన్నత విద్యాశాఖ విడుదల చేసిన నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ ర్యాంకుల్లో మన ప్రాంత విశ్వవిద్యాలయ ర్యాంకులు పడిపోయాయి. శాతవాహన, తెలంగాణ వంటి కొన్ని కొత్త యూనివర్సిటీలు ఏర్పడి 16 సంవత్సరాలు పూర్తవుతున్నా వాటిలో కొత్త కోర్సులు అందుబాటులోకి రాలేదు. ఇంజినీరింగ్, లా, బీఎడ్ వంటి అనుబంధ కళాశాలలను ఏర్పాటు చేయలేదు. బ్లాక్ గ్రాంట్ నిలుపుదల కారణంగా సిబ్బంది జీతభత్యాలకు వెంపర్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిశోధనలకు బాటలు వేసే ప్రయోగశాలలు అగమ్యగోచరంగా మారాయి. గ్రంథాలయాలు అస్తవ్యస్తమయ్యాయి. మౌలిక వసతుల కల్పన ఊసే లేకుండా పోయింది. మొత్తంగా విశ్వ విద్య తిరోగమనంలో పడిపోయింది. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో 80 శాతం ప్రొఫెసర్ల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం ప్రతీ డిపార్ట్‌మెంట్‌లో నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, ఒక ప్రొఫెసర్ పోస్టు తప్పకుండా ఉండాలి. కానీ, ఇప్పటికీ వేల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఫలితంగా పోటీ పరీక్షల్లో కష్టపడి ర్యాంకులు సాధించి ప్రవేశాలు పొందిన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందకుండా పోయింది. బోధించే వారు లేక కొన్ని కళాశాలల్లో కోర్సులు రద్దయ్యే పరిస్థితి నెలకొంది.

పాఠాలు వినక, పరిశోధనలు చేయక. అసలు విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తున్నారు, ఎలా పట్టభద్రులవుతున్నారనేది సందేహాస్పదమే. నియామకాల కోసం కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం విఫలయత్నం చేసింది. ఈ బిల్లు గవర్నర్ ఆమోదం పొందకుండా చివరకు న్యాయస్థానం జోక్యంతో రాష్ట్రపతి పరిశీలనకు వెళ్లి పెండింగ్‌లో పడిపోయింది. ఓ దశలో యూనివర్సిటీల పాలనను ముఖ్యమంత్రి పరిధిలోకి తీసుకొచ్చేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. రాజకీయ జోక్యం పెరిగితే విశ్వవిద్యాలయాలు నామరూపాల్లేకుండా పోతాయని, ఈ విధ్వంస రచనను మానుకోవాలని మేధావులు చేసిన వ్యతిరేకత కారణంగా ఆ ఆలోచన అమలు చేయకుండా నిలిపేశారు. వైద్య శాఖలో ప్రత్యేక శ్రద్ధతో ఆగమేఘాల మీద ప్రొఫెసర్ల నియామకాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలకు మాత్రం మొండిచేయి చూపింది. మరోవైపు వయోపరిమితి దాటిపోతున్నా తాత్కాలిక ప్రొఫెసర్ల క్రమబద్ధీకరణ లేక, బోధనేతర సిబ్బంది నియామకం చేపట్టక, ప్రతిభావంతులైన ప్రొఫెసర్లు లేక పరిశోధనలు కుంటుపడుతున్నాయి. అసౌకర్యాల నడుమ యూనివర్సిటీలు కేవలం పట్టభద్రులను తయారుచేసే కర్మాగారాలుగా మారాయి. దీంతో సరైన ప్రతిభ లేకుండా నామమాత్రపు పట్టాలతో విద్యార్థులు బయటకొచ్చి, పోటీ ప్రపంచంలో అవకాశాలు దక్కించుకోలేక నిరుద్యోగులుగా మారే పరిస్థితి ఏర్పడింది. ఏళ్లుగా నియామకాల ప్రకటన కోసం వేచి చూసి వయోపరిమితి దాటిపోయిన నిరుద్యోగ పట్టభద్రులు లెక్కలేనంతమంది. ఇలాంటి పరిస్థితిలో ఉద్యోగ విరమణ పొందే ప్రొఫెసర్ల గరిష్ట వయసును 65 సంవత్సరాలకు పెంచాలన్న ఆలోచన పక్కనపెట్టి , నూతన నియామకాల కోసం నోటిఫికేషన్లు జారీ చేస్తే నిరుద్యోగ పట్టభద్రులకు అవకాశాలు మెరుగవుతాయి. ప్రభుత్వ విద్యారంగానికి సమాంతరంగా ప్రైవేటు మాఫియాని ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పెరిగిన కొత్త జిల్లాల్లో నూతనంగా మంజూరు చేయాల్సిన ప్రభుత్వ రాష్ట్ర విశ్వవిద్యాలయాల సంగతి పక్కన పెట్టింది. అవసరం లేకపోయినా ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు బిల్లుకు ఆగమేఘాల మీద ఆమోదం తెలిపింది. కేవలం తమ అనుయాయులకు లబ్ధి చేకూర్చేందుకు మహీంద్రా, వోక్సెన్, మల్లారెడ్డి, ఎస్.ఆర్., అనురాగ్ పేరిట అయిదు ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటును గవర్నర్‌తో ఆమోదింపజేసుకున్నారు. అదనంగా మరో అయిదింటిని ఏర్పాటు చేయాలనుకున్నా, ఆ బిల్లును గవర్నర్ తిప్పి పంపించారు. ప్రభుత్వ అనాలోచితం కారణంగా ఈ అయిదు విశ్వవిద్యాలయాల్లో అప్పటికే ప్రవేశం పొందిన దాదాపు 40 వేల మంది పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అనుమతి వచ్చిన యూనివర్సిటీల్లోనూ నిబంధనలకు పాతరేశారు. సరైన భవనాలు లేకపోయినా, లీజు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లో వీటిని ప్రారంభించారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఐదు ప్రైవేట్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి పర్యవేక్షణ లేకుండా వీటికి ప్రత్యేక నిబంధనలు రూపొందించడం అనుమానాలకు తావిచ్చింది. ప్రైవేటు వర్సిటీల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయకపోవడం విడ్డూరం. తాజాగా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన విద్యాశాఖ సమీక్షలో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి రిజర్వేషన్లు అమలు చేస్తామని, ప్రవేశాలపై ఆంక్షలు విధిస్తామని, ఫీజుల నియంత్రణకు కమిటీలు నియమిస్తామని, అవసరమైతే చట్ట సవరణ చేపడుతామని ప్రకటించడం ఊరటనిచ్చే విషయం. అదే సమయంలో భౌగోళికంగా పెద్దదైన ఉమ్మడి ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో కొత్తగా రాష్ట్ర విశ్వవిద్యాలయాలు ఏర్పాటు చేస్తామని. నైపుణ్య అభివృద్ధి కేంద్రాలను ప్రకటించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో నైపుణ్య విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని, ప్రణాళికలు రూపొందించాలని ఆదేశాలివ్వడం మార్పునకు సంకేతంగా భావించొచ్చు.

# కార్మిక పక్షపాతి వరహగిరి...



భారత దేశానికి 4వ రాష్ట్రపతిగా, కార్మిక ఉద్యమానికి విశేషమైన సేవలు చేసిన శ్రీ వి.వి.గిరిగా ప్రసిద్ధుడైన వరాహగిరి వేంకటగిరి (ఆగష్టు 10, 1894 - జూన్ 23, 1980) గారు అప్పటి మద్రాసు ప్రెసిడెన్సీలోని గంజాం జిల్లాకు చెందిన బెర్హాంపూర్ పట్టణములోని ఒక తెలుగు నియోగి బ్రాహ్మణ కుటుంబములో జన్మించారు. ఆయన తండ్రి వరాహగిరి వెంకట జోగయ్య ప్రసిద్ధిచెందిన న్యాయవాది. 1913లో ఆయన యూనివర్శిటీ కళాశాల డబ్లిన్ లో న్యాయశాస్త్రం అభ్యసించడానికి వెళ్లారు. అయితే ఐర్లండ్ లో సీన్‌ఫెన్ ఉద్యమములో పాల్గొని దేశ బహిష్కరణకు గురయ్యారు. ఆ ఉద్యమ కాలములోనే ఆయనకు ఈమొన్ డి వలేరా, మైఖెల్ కోలిన్స్, పాట్రిక్ పియర్సె, డెస్మండ్ ఫిట్జెరాల్డ్, ఈయోన్ మెక్‌నీల్, జేమ్స్ కాన్నలీ తదితరులతో సన్నిహితం ఏర్పడింది. 1914 లో బ్రిటన్ లో గాంధీజిని కలిసారు.వారి సలహామేరకు బ్రిటన్ రెడ్ క్రాస్ లో చేరారు. అక్కడే భారతీయవిద్యార్థి సంఘాన్ని స్థాపించి కార్యదర్శిగా పనిచేసారు.1916 భారత దేశం వచ్చి న్యాయవాద వృత్తి చేపట్టారు. భారతీయ కార్మికుల సమస్యలపై పూర్తి అవగాహన ఏర్పరుచు కున్నారు. అనిబీసెంట్ ప్రారంభించిన హోంరూల్ ఉద్యమంలో భాగస్వామి అయ్యారు. జాతీయ కాంగ్రెసులో చేరారు. సహాయ నిరాకణ ఉద్యమంలో పాల్గొని ఏడాది చెరసాలశిక్ష అనుభవించారు. తర్వాత క్రియాశీలంగా కార్మిక ఉద్యమములో పాల్గొని అఖిల భారత రైల్వే ఉద్యోగుల సమాఖ్యకు ప్రధాన కార్యదర్శి, ఆ తరువాత అధ్యక్షులుగా పని చేశారు. రెండు పర్యాయాలు అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కూడా పనిచేశారు. గిరి 1934లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో సభ్యుడయ్యాడు. 1936లో మద్రాసు రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గిరి కాంగ్రేసు అభ్యర్థిగా బొబ్బిలి రాజా పై పోటీ చేసి గెలిచాడు. 1937లో మద్రాసు ప్రోవిన్స్ లో రాజాజీ నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రేసు ప్రభుత్వంలో కార్మిక, పరిశ్రమల మంత్రిగా పనిచేశాడు. 1942లో కాంగ్రేసు ప్రభుత్వాలన్నీ రాజీనామా చేసినప్పుడు, గిరి తిరిగి క్విట్ ఇండియా ఉద్యమంలో భాగంగా కార్మిక ఉద్యమాన్ని నడిపి జైలుకు వెళ్ళాడు. ఈయన రాజమండ్రి జైలులో ఖైదీగా ఉంచారు.1934-37 వరకు భారత శాసనసభ్యునిగా ఎంపిక అయ్యారు.1927 లో జనీవాలో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశానికి హాజరైనారు. అనంతరం బొబ్బిలి రాజావారిపై పోటీ చేసి గెలుపొందారు.1937 రాజాజి మంత్రివర్గంలో చేరారు.

# చిన్నమ్మ రీఎంట్రీ వ్యూహం...?

ఏపీ ఎన్నికల సందర్భంగా తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి సాధించిన ఘన విజయం తమిళనాడులోనూ అటువంటి కూటమి ఆవశ్యకతను తెలియజేస్తోంది. ముఖ్యంగా బీజేపీకి ఆ అవసరం ఉంది. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఆంధ్రలో ఏర్పడ్డ కూటమి వంటిది తమిళ నాడులోనూ ఏర్పడాలి. ఈ ప్రశ్నలకు సమాధానం రానున్న రోజుల్లో తెలియనున్నాయి. తమిళనాడులో స్వర్గీయ జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడూ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ ఆమె నీడలా మెలుగుతూ శశికళ రాష్ట్రంలో పాలన పరంగానూ, పార్టీ పరంగానూ చక్రం తిప్పేవారు. అది అప్పట్లో పలు వివాదాలకు కూడా కారణం అయింది. ఎంజీ రామచంద్రన్ మరణానంతరం పార్టీ తిరస్కారానికి, అవమానాలకు గురై ఒంటరి ఐన జయలలిత తన మేధ, తన తీరుతో పుంజుకుంటూ కరుణానిధికి పోటీగా రాటుదేలుతున్న సమయంలో శశికళ, ఆమె బంధువర్గం జయలలితకు తోడూ నీడ అయ్యారు. జయలలితకు వాళ్లు అంగరక్షకులుగా కూడా నిలిచారు. జయలలిత రాష్ట్ర ముఖ్యమంత్రి అయిన తరువాత నుంచీ ఆమె గెలుపు ఓటముల్లో శశికళ భాగమయ్యారు. అన్నా ద్రావిడ మున్నేట్ర కళగం పూర్తిగా శశికళ పట్టులో ఉండేది. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలో శశికళ వ్యక్తులే కీలక స్థానాల్లో ఉండేవారు. కీలకమైన ప్రభుత్వ అధికారులుగా కూడా శశికళ వ్యక్తులనే నియమించారు. ఒక కేసులో శిక్ష పడి శశికళ జైలుకు వెళ్లగా ఎడప్పాడి పళనిస్వామి తమిళనాడు ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన కూడా శశికళ విధేయుడే. శశికళ పాదాలపై పడి ఆశీర్వాదం పొంది సీఎం అయిన వ్యక్తే. శశికళ జైలుకు వెళ్లాక పళనిస్వామి పార్టీపై తన పట్టు బిగించి పార్టీని సొంతం చేసుకున్నారు. ఆ క్రమంలో శశికళను పూర్తిగా పార్టీకి దూరం చేశారు. అందువల్ల శిక్షాకాలం ముగించుకుని వచ్చిన శశికళ రాజకీయాలకు, పార్టీకి దూరంగానే ఉండాల్సి వచ్చింది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పళనిస్వామి అధ్యక్షతన ఏఐఏడీఎమ్‌కె పార్టీ ఓడిపోయి డీఎమ్‌కే పార్టీ అధినేత స్టాలిన్ ముఖ్యమంత్రి అయ్యారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లోనూ ఈ పార్టీ ఓటమినే చవి చూసింది. పళనిస్వామి పార్టీలోనూ, ప్రజా క్షేత్రంలోనూ బలహీనుడవుతున్నారు. లోక్ సభ ఎన్నికలయ్యాక, శశికళ ఏఐఏడీఎమ్‌కె పార్టీ శ్రేణులతో సమావేశమవడం, తదుపరి కార్యాచరణకు సిద్ధమవడం తమిళనాడులో చర్చోపచర్చలు మూలం, మూలకం అవుతోంది. తమిళనాడులో ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటు శాతాన్ని పెంచుకోగలిగినా ఏ ఒక్క స్థానాన్ని సాధించలేకపోయింది. ఈ ఎన్నికల్లో ఏఐఏడీఎమ్‌కె పార్టీతో పొత్తు పెట్టుకునే విషయంలో బీజేపీ రాష్ట్రాధ్యక్షుడు అన్నామలై సుముఖంగా లేనందువల్ల పొత్తు కుదరలేదు.

# కేజ్రీవాల్ విడుదలకు ఇడి అడ్డంకులు....

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విడుదలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరోమారు మోకాలడ్డింది. ఆయనకు బెయిల్ వచ్చినా..విడుదల కాకుండా అడ్డుకుంది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు కేజ్రీవాల్‌కు గురువారం బెయిల్ మంజూరు చేసిన సంగతి తెలిసిందే. అయితే ఆ బెయిల్ ఉత్తర్వులు కోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలోపే ఇడి అధికారులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించి బెయిల్‌పై స్టే విధించాలని కోరారు. ఇడి అభ్యంతరాలతో కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై స్టే విధిస్తూ ఢిల్లీ హైకోర్టు శుక్రవారం నాడు ఉత్తర్వులు వెలువరించింది. తుది నిర్ణయం కోసం తదుపరి విచారణను మంగళవారం నాడు చేపట్టనున్నట్లు తెలిపింది. అయితే బెయిల్ కాపీ ట్రయల్ కోర్టు అప్‌లోడ్ చేయకముందే ఇడి హైకోర్టును ఆశ్రయించడం, ఆ వెనువెంటనే విచారణ చేపట్టడం, బెయిల్‌పై స్టే విధించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆప్ నేతలు కూడా ఇడి తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ పాలసీకి సంబంధించి మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు రౌస్ అవెన్యూ కోర్టు గురువారం బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.




## ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి


### - పెండింగ్ పెట్టవద్దు
### - జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్:** ప్రజావాణిలో దరఖాస్తుల స్వీకరణ ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే సమస్యలను సత్వరమే అధికారులు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలు పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తులపై నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, పెండింగ్లో పెట్టకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 312 దరఖాస్తులు వచ్చాయి. కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయానికి సంబంధించిన దరఖాస్తులు 47, డిపిఓ కార్యాలయానికి 25, డీఈఓ కార్యాలయానికి 14, పోలీస్ కమిషనర్ కార్యాలయానికి 11, కరీంనగర్ ఆర్డీవో కార్యాలయానికి 14, కరీంనగర్ రూరల్ తహసిల్దార్ కార్యాలయానికి 24, గంగాధర 10, తిమ్మాపూర్ 10, మానకొండూర్ తహసీల్దార్ కార్యాలయానికి 10, వారధి సొసైటీకి 13 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఆర్ఓ పవన్ కుమార్, కరీంనగర్, హుజురాబాద్ ఆర్టీవోలు కే మహేశ్వర్, రమేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుదాం.. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

అందరం కలిసి కరీంనగర్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుదామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. అధికారులంతా జిల్లా అభివృద్ధికి కలిసికట్టుగా పని చేయాలని పేర్కొన్నారు. సమన్వయంతో అందరం పనిచేయడం వల్ల పని ఒత్తిడి తగ్గుతుందని సూచించారు. సమస్యల పరిష్కారంతోపాటు జిల్లాను అభివృద్ధిలో ముందు ఉంచేందుకు అందరం శ్రమిద్దామని పేర్కొన్నారు. అధికారులంతా బాధ్యతయుతంగా పనిచేయాలని తెలిపారు.

## ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధాలిస్తే.. మేం ఉత్తర కొరియాకు ఇస్తాం- పుతిన్




సౌత్ కొరియాపై రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫైర్ అయ్యారు. మాస్కోపై పోరాడేందుకు ఉక్రెయిన్ కు ఆయుధాలు ఇస్తే ఊరుకునేది లేదన్నారు. ఒకవేళ సియోల్ ఈ పని చేస్తే.. అది అతిపెద్ద తప్పిదం అవుతుందని హెచ్చరించారు. తమపై దాడుల కోసం ఉక్రెయిన్ కు యుద్ధ సామగ్రి సరఫరా చేయాలని నిర్ణయించుకుంటే.. ఆ దేశానికి వ్యతిరేకంగా అనూహ్య నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. వియత్నాం పర్యటనలో భాగంగా పుతిన్ మీడియాతో మాట్లాడారు. అమెరికా, దాని మిత్రదేశాలు కీవ్‌కు ఆయుధాల సరఫరా కొనసాగిస్తే.. తామూ కిమ్ ప్రభుత్వానికి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉక్రెయిన్‌కు యుద్ధ సామగ్రి అందిస్తున్న దేశాలు తమపై దండెత్తడం లేదనుకుంటున్నాయని పుతిన్ పేర్కొన్నారు. ఇలాంటి టైంలో ఉత్తర కొరియాకు ఆయుధాలు సరఫరా చేసే హక్కు తమకూ ఉందని హెచ్చరించారు. పుతిన్ వ్యాఖ్యలపై దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం స్పందించింది. కీవ్‌కు ఆయుధాలను సరఫరా చేసే విషయాన్ని పరిశీలిస్తామని మరోసారి తెలిపింది. రష్యా ఎలా స్పందిస్తుందనే దానిపై తమ వైఖరి ఆధారపడి ఉంటుందని పేర్కొంది. అంతకుముందు.. తమ దేశంలోని మాస్కో రాయబారిని పిలిపించిన దక్షిణ కొరియా.. ప్యాంగాంగ్‌తో సైనిక సహకారాన్ని తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేసింది.

## గ్రాడ్యుయేట్ అయితే నేరుగా గ్రీన్‌కార్డు...!




ఎన్నికల ప్రచారంలో భాగంగా అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా కళాశాలల నుంచి గ్రాడ్యుయేట్ అయిన విదేశీ విద్యార్థులకు నేరుగా గ్రీన్‌కార్డు ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. కంపెనీలు విదేశాల నుంచి ప్రతిభావంతులను నియమించుకోవడంపై మీ ప్రణాళికలేంటని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా సమాధానమిచ్చారు. ఎన్నికల ప్రచారంలో వలస విధానంపై ఫైర్ అయ్యే ట్రంప్.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం గమనార్హం. గ్రాడ్యుయేట్ కాగానే అమెరికాలో ఉండేందుకు వీలుగా డిప్లొమాతో పాటే నేరుగా గ్రీన్ కార్డ్ ఇవ్వాలని అనుకుంటున్నట్లు తెలిపారు. అది రెండేళ్ల.. నాలుగేళ్లు.. ఇలా వ్యవధితో సంబంధం లేదన్నారు. జూనియర్ కాలేజ్ లకు కూడా ఈ విధానాన్ని వర్తింపజేయనున్నట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే దీనిపై దృష్టి సారిస్తానని ట్రంప్ ప్రకటించారు. కరోనా వల్ల ఈ విదానాన్ని గతంలో అమలు చేయలేకపోయానని తెలిపారు. వీసా సమస్యల వల్ల భారత్, చైనా నుంచి వస్తున్న చాలామంది అమెరికాలో ఉండలేకపోతున్నారని అన్నారు. రెండోసారి అధ్యక్ష పీఠం కోసం ట్రంప్ బరిలో ఉన్నారు. అయితే, ఈసారి మాత్రం గతంలో చేసిన వాటికి భిన్నంగా వ్యాఖ్యలు చేయడం విశేషం. అక్రమ వలసదారులు దేశంలో నిరుద్యోగం, హింస, నేరాలు, వనరుల దోపిడీకి కారణమవుతున్నారని చాలా సందర్భాల్లో విరుచుకుపడ్డారు. తాను అధికారంలోకి వస్తే వారందరినీ తిప్పి పంపిస్తానని హామీ ఇచ్చారు. కానీ, ఈసారి మాత్రం దానికి విరుద్ధంగా హామీలు ఇస్తున్నారు.

## సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం బలోపేతం




మాస్కో : సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నట్లు వియత్నాం, రష్యాలు గురువారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశాయి. వియత్నాంలో అధికారిక పర్యటన జరుపుతున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, వియత్నాం అధ్యక్షుడు ట లామ్‌తో చర్చలు జరిపిన తర్వాత ఈ ప్రకటన వెలువడింది. విద్య, న్యాయం సహా పలు రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించే ఒప్పందాలపై కూడా ఇరువురు నేతలు సంతకాలు చేశారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచాలని, ఉన్నత స్థాయిలో పరస్పర మార్పిడులను పటిష్టపరుచుకోవాలని నిర్ణయించారు. సాంప్రదాయబద్ధంగా రష్యా, వియత్నాం మధ్య నెలకొన్న సంబంధాలను మరింత పటిష్టపరుచుకోవాల్సి వుందని, అందుకు రష్యా అధిక ప్రాముఖ్యతను ఇస్తుందని పుతిన్ పేర్కొన్నారు.

## రఫాపై ఇజ్రాయెల్ దాడి..



ప్రపంచ దేశాలు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కూడా ఇజ్రాయెల్, రఫా నగరంపై దాడులు మాత్రం ఆపడం లేదు. తాజాగా శుక్రవారం ఇజ్రాయెల్ దళాలు గాజాలోని రఫాపై దాడి చేశాయి. ఈ దాడుల్లో దాదాపు 45 మంది పాలస్తీనియన్లు మరణించినట్లు, ఇంకా చాలా మంది గాయపడినట్లు సమాచారం. హమాస్ గ్రూపు కార్యకర్తలను అంతం చేయడమే లక్ష్యంగా సాగుతున్న దాడుల్లో అమాయక ప్రజలు కూడా తమ ప్రాణాలను కోల్పోతున్నారు. విమానాలు, ట్యాంకులు, ఓడల నుండి కాల్పులు జరపడం వల్ల ఎక్కువ మంది ప్రజలు నగరం నుండి తమ ప్రాణాలు కాపాడుకోవడానికి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. శరణార్థి శిబిరాల్లో ఉగ్రవాదులు తలదాచుకుంటారనే అనుమానంతో వాటిపై కూడా ఇజ్రాయెల్ దళాలు దాడులు చేయడంతో అక్కడి నుంచి కూడా ప్రజలు తరలిపోతూ కొత్త సురక్షిత ప్రాంతాలను వెతుక్కుంటున్నారు. గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా పేర్కొన్న దాని ప్రకారం, పశ్చిమ రఫాలో మానవతా సేఫ్ జోన్‌గా గుర్తించబడినని మవాసిలో గుడారాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్న కుటుంబాలపై ఇజ్రాయెల్ దళాలు బాంబు దాడులు చేయడంతో 25 మంది పాలస్తీనియన్లు మరణించారని, 50 మంది గాయపడ్డారని, వీరి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుందని తెలిపింది.

## రష్యా రాయబారికి సమన్లు...!



**సియోల్ :** ఉత్తర కొరియాతో రక్షణ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ రష్యా రాయబారికి దక్షిణ కొరియా శుక్రవారం సమన్లు జారీ చేసింది. సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందంపై రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌లు బుధవారం సంతకాలు చేసిన సంగతి తెలిసిందే. ఒప్పందం జరిగిన రెండు రోజుల తర్వాత ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. పుతిన్, కిమ్‌ల మధ్య ఒప్పందంపై దక్షిణ కొరియా వైఖరిని తెలియజేయడానికి రష్యా రాయబారి జార్జ్ జినోవివ్‌ను దక్షిణ కొరియా ఉప విదేశాంగ మంత్రి కిమ్ హాంగ్ క్యున్ పిలిపించారు. ఈ సమావేశంపై సమాచారమిచ్చేందుకు దక్షిణ కొరియా విదేశాంగ శాఖ నిరాకరించింది. ఈ ఒప్పందాన్ని దక్షిణ కొరియా తీవ్రంగా వ్యతిరేకించింది. దక్షిణాది భద్రతకు ముప్పు అని ఆరోపించింది. ఉక్రెయిన్‌కు ఆయుధాలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపింది. అమెరికా మద్దతుతో దక్షిణ కొరియా ఆయుధాల ఎగుమతులను వేగవంతం చేసింది. రష్యాకు వ్యతిరేకంగా అమెరికా నేతృత్వంలో ఆర్థిక ఆంక్షల ఒప్పందంలో చేరినప్పటి నుండి ఉక్రెయిన్‌కు మానవతా సాయంతో అందించడంతో పాటు ఇతర అంశాల్లోనూ మద్దతుగా నిలుస్తోంది.

## చిరస్మరణీయుడు కొంపెల్ల...!

శ్రీ శ్రీ (శ్రీరంగం శ్రీనివాసరావు) పేరు ఎరుగని తెలుగువాడు ఉండడంటే అతిశయోక్తి కాదు. పండితుల చర్చాగోష్ఠుల్లోనూ, ప్రాచీన గ్రంథాలలో, రాజ ఆస్తానాలలో, మాత్రమే ఆదరణకు నోచుకున్న తెలుగు సాహితీ గొప్పతనాన్ని, వైభవాన్ని సామాన్యుడి చెంతకు చేర్చిన ఘనత మహాకవి శ్రీ శ్రీదే.. తెలుగు సాహిత్యంలో సామాన్యుడి కష్టనష్టాల గురించీ, పేదసాదల జీవితాలని ప్రతిబింబించే కవిత్వాన్ని రాసిన మొదటి కవిగా ఆయన చిరస్మరణీయుడు. ఆయన రచనల్లో 1950 లో ప్రచురించ బడిన 'మహాప్రస్థానం' అనే కవితా సంపుటి తెలుగు సాహితీ అభిమానుల మనసుల్లోనే కాకుండా.. సామాన్య ప్రజల గుండెల్లో కూడా చిరస్థాయిగా నిలిచిపోతుంది. అయితే శ్రీశ్రీకి కొత్త మార్గ నిర్దేశనం చేసింది కొంపెల్ల జనార్ధనరావు అనే విషయం చాలా మందికి తెలియదు. ఒక గొప్పస్థాయి పత్రికగా స్వయంగా రూపుదిద్దిన 'ఉదయిని పత్రికలో మహాప్రస్థానగీతాలలోని మొదటిగేయం 'నేను సైతం' (జయభేరి) గీతంను అచ్చువేయడం విశేషం. 1928లో శ్రీశ్రీ రచించిన తొలి కావ్యం 'ప్రభవ' ను కొంపెల్ల సమీక్షిస్తూ తీవ్రంగా వ్యతిరేక విమర్శలు చేశారు. శ్రీశ్రీ ఇంకా సుదీర్ఘ సమాసాలు తగ్గించాలని, సంస్కృతం ఎక్కువైందని, అనుకరణ వద్దని' స్పష్టం చేశాడు కొంపెల్ల. అప్పటికి శ్రీశ్రీ... కృష్ణశాస్త్రి విశ్వనాధల ప్రభావంలో కొట్టుకు పోతున్న వేళలో శ్రీశ్రీలో...సొంతగొంతుక కావాలన్న స్పృహను పటిష్ఠ పరిచింది కొంపెల్ల సద్విమర్శనే. ఆ విమర్శల వల్లనే కలిసి వీరిద్దరు విడిపోని స్నేహితులు అయ్యారు. ఆప్త మిత్రులయ్యారు. అప్పటి నుంచి 1937లో కొంపెల్ల మరణించేవరకూ వారిద్దరి స్నేహం కొనసాగింది. భావ కవితను పల్లెత్తుమాటంటే భరించలేని రోజులలో శ్రీ శ్రీ 'సుప్తాస్థికలు' కవిత రాసారు. దాన్ని 'భారతి'కి పంపిస్తే అది తిరుగు టపాలో ఇంటికి చేరింది. పంపేసింది. కవితాధోరణిని మార్చడానికి తాను సిద్ధంగా ఉన్నా- కొత్త భావాన్ని స్వీకరించడానికి ఎవరూ సిద్ధంగా లేరని శ్రీశ్రీ గ్రహించారు. శ్రీశ్రీకి ఏదో తపన. నవీన రీతితో గీతిక రాయాలని... దానికి వేగాన్నిచ్చింది కొంపెల్ల సాహిత్యం: ఉత్తేజాన్నిచ్చింది ఉదయినిలో జయభేరి ప్రచురణం. కొత్త బాణీలు రాస్తే ఎవరూ అచ్చు వేయరన్న దిగులును శ్రీశ్రీకి పోగొట్టినవారు కొంపెల్ల. శ్రీశ్రీకి, కొంపెల్లకు ఏ రకమైన భావసారూప్యత లేకున్నా వారి మధ్య స్నేహం మాత్రం చాలా చక్కగా కలిసి పోవడం విశేషం. శ్రీశ్రీ మహా ప్రస్థానాన్ని అంకితమిస్తూ ఇతని గురించి కొంపెల్ల జనార్ధనరావు కోసం కవిత రాశారు. కొంపెల్ల జనార్ధనరావు (1907 - 1937) ప్రముఖ భావకవి, నాటక రచయిత. అతడు 1906 ఏప్రిల్ 15న తూర్పు గోదావరి జిల్లా, కపిలేశ్వరపురం మండలం, మోడేకుర్రులో జన్మించారు. సరికొత్త సాహిత్యం సృష్టించాలన్న ఆవేశం ఆయనది. పుటం పెట్టిన బంగారంలాంటి కవితను కాంక్షించే తత్త్వమది. ఇరవై ఏళ్ళ నిండకుండానే యూరోపియన్ సాహిత్యాన్ని మధించిన మేధస్సు ఆయనది. నాటి మేటి సాహిత్య పత్రిక 'భారతి'లో రెండు పదుల వయసులోనే ఉపసంపాదకుడిగా చేరి, శ్రీశ్రీని కాబోయే మహాకవిగా గుర్తించ గలిగిన గొప్ప పరిశీలకులు. పదునైన విమర్శలు చేయడంలో ఆయనకు ఆయనే సాటి. శ్రీశ్రీ, కొంపెల్ల మనసులు కలిసిన ఇద్దరూ కలిసి సాహిత్యమే సమస్తమూ అనుకొని తిండీ నిద్రా వదిలి ఎక్కడ వున్నారో ఎక్కడకు పోతున్నారో... తెలియని ఆవేశంతో మద్రానంతా తిరిగేవారు. హైకోర్ట్ బీచ్, రామకృష్ణ లంచ్ హోం, అడయార్ కన్నెమురా లైబ్రరీ, పరశువాకం ఎగ్మూర్ వీధుల్లో సంచరించే వారు. విశాఖపట్నం లోని 'కవితా సమితి' ద్వారా పురిపండా అప్పలస్వామి సాహచర్యంతో మల్లంపల్లి సోమశేఖర శర్మ ప్రేరణతో భారతి పత్రికలో చేరాడు. భారతి, ఆంధ్రపత్రిక, సుభాషిణి మొదలైన పత్రికలలో దాదాపు 25 కవితా ఖండికలను భావ కవితారీతిలో ప్రచురించాడు. బసవరాజు అప్పారావు 'ఆంధ్ర కవిత్వ చరిత్ర కృష్ణశాస్త్రి 'ప్రవాసం, ఊర్వశి' తల్లావఝ్ఝుల 'అవేదన' లాంటి గ్రంథాల్ని చీల్చి చెండాడే వాడు కొంపెల్ల. స్థానం నరసింహా రావంతటి గొప్ప నటుడి సత్యభామ నటన తేలిపోయిందని ధైర్యంగా ప్రకటించినవాడు కొంపెల్ల. 1934 డిసెంబరులో ఉదయిని అనే ద్వైమాసిక సాహిత్య పత్రికను వెలువరించడం ప్రారంభించాడు. ఇతడు 'తాన్ సేన్', 'తెలుగు' అనే నాటికలు రచించాడు. ఒక గొప్పస్థాయి పత్రికగా 'ఉదయిని' ఉదయించింది. 1934 డిసెంబర్ తొలి సంచిక కొంగొత్త 'కిరణాలు' ప్రసరించింది.' నేను సైతం ప్రపంచాగ్నికి' అంటూ విప్లవాత్మక పంథాలో రాసిన శ్రీశ్రీ కవితను ముద్రించాడు. ఇది నిజంగా శ్రీశ్రీకి కొండంత అండగా నిలిచి, ధైర్యాన్నిచ్చిన నేపథ్యం. ఉదయిని అనే సాహితీ పత్రికకు సంపాదకత్వం వహించిన కొంపెల్ల... దేవులపల్లి కృష్ణశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, నోరి నరసింహశాస్త్రి, దామెర రాజగోపాలరావు, ముద్దుకృష్ణ, చింతా దీక్షితులు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, చలం, నేలటూరి వెంకట రమణయ్య, శ్రీరంగం శ్రీనివాసరావు, కొండేపూడి సుబ్బారావు, అడివి బాపిరాజు, తెలికిచెర్ల కృష్ణమూర్తి, కవికొండల వెంకటరావు, కొమఝ్ఝాజు వినాయకరావు, కందుకూరి రామభద్రరావు, దువ్వూరి రామిరెడ్డి, శ్రీపాద గోపాల కృష్ణమూర్తి, పింగళి లక్ష్మీకాంతం, కాటూరి వెంకటేశ్వరరావు, కొడాలి ఆంజనేయులు, కరుణకుమార, వెంపటి నాగభూషణం, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, ఆచంట జానకీరాం, కొంపెల్ల జనార్ధనరావు మొదలైనవారి రచనలను ప్రచురించారు. ఉదయిని సాహిత్య పత్రికను ఆయన ద్వైమాసిక పత్రికగా ఆరు సంచికల కన్నా వెలువరించలేకపోయారు. సాహిత్యానికి ప్రజాభిమానం సంపాదించాలన్న గొప్ప ఆశయంతో అహర్నిశలు పనిచేసి పత్రికను కొనమని వాడవాడలా బిచ్చమెత్తారు. ముద్రణ ఖర్చులు కొంపెల్ల ఇవ్వలేక పోవడంతో ముద్రాపకుడు ఉదయిని ఏడో సంచికను చిత్తు కాగితాలుగా అమ్మేశారు. ఈ అఘాతం తట్టుకోలేక, అనారోగ్యం తీవ్రమై క్షయ వ్యాధితో దుర్భర దారిద్ర్యంలో దీనస్థితిలో ఆయన జూన్ 23, 1937 సంవత్సరంలో క్షయ వ్యాధితో కొంపెల్ల మరణించారు.

# బరువు పెరుగుతున్నారని బ్రేక్ ఫాస్ట్ మానేస్తున్నారా...?

కొవ్వు, పొట్ట, భారీ శరీరం ఈ రోజుల్లో చాలా మందికి కామన్ గా ఉంటున్నాయి. దానికి కారణాలు కూడా కామన్ గానే ఉంటున్నాయి. సరైన సలహాలతో డైట్ పాటిస్తే మీ బరువు కాస్త తగ్గే ఆస్కారం ఉంటుంది. కానీ ఎవరో చెప్పింది పాటించడం, తెలిసి తెలియని వారి సలహాలు పాటిస్తే మీ బరువులో ఏ మాత్రం తేడా కనిపించదు. రోజు మీరు చేసే కొన్ని తప్పుల వల్ల కూడా మీరు బరువు పెరుగుతుంటారు. అయితే మీరు రోజు ఉదయం చేసే కొన్ని పొరపాట్ల గురించి తెలుసుకుంటే బరువు సమస్య నుంచి బయటపడవచ్చు. ఉదయం పూట చాలా మంది బ్రేక్ ఫాస్ట్ తీసుకోవడం మానేస్తారు. బ్రేక్ ఫాస్ట్ కూడా మానేసి తక్కువ తినాలి అనుకుంటారు . ఇలా చేస్తే బరువు తగ్గుతారని అనుకుంటారు. కానీ ఇలా చేయడం చాలా పెద్ద తప్పు అంటున్నారు నిపుణులు. ఇలా చేస్తే మీ బరువు మరింత పెరిగే అవకాశం ఎక్కువ ఉంటుంది. బ్రేక్ ఫాస్ట్ మానేయడం వల్ల జీవక్రియ దెబ్బతింటుంది. దీని వల్ల హెల్దీగా ఉండే జీవక్రియ మందగించి సమస్యలు వస్తాయి. ఈ స్లో మెటబాలిజం మిమ్మల్ని బరువు పెరిగేలా చేస్తుంది. ఇక బ్రేక్ ఫాస్ట్ చేయకుండా ఉంటే లంచ్ వరకు వెయిట్ చేయాల్సిందే. మధ్యలో ఆకలి వేసినా సరే కూడా ఏదో ఒకటి తినేస్తారు. ఇలా తినడం వల్ల కూడా మీ బరువు పెరుగుతుంది. కొందరు ఉదయం సమయం లేదని అల్పాహారం మానేస్తుంటారు. దీని వల్ల చాలా సమస్యలు వస్తాయని, బరువు కూడా పెరుగుతారని అంటున్నారు నిపుణులు. ఇక ఈ సమస్య నుంచి బయటపడటానికి ఓట్స్ తీసుకోవడం బెటర్. సమయం దాటి ఎప్పుడు కూడా తినకూడదు. ప్రతి ఒక్కటి కూడా సమయం ప్రకారమే తినాలి. అయితే ఒకేసారి ఎక్కువ తినడం కంటే కొంచెం కొంచెం తినడం చాలా ఉత్తమం. దీని వల్ల జీర్ణక్రియ సులభతరం అవుతుంది. మీ జీవక్రియ కూడా మెరుగుపడుతుంది.



# చర్మ సమస్యలు గుండె జబ్బులకు దారితీస్తాయా...?



కొన్ని ఆరోగ్య సమస్యలు అంతటికే పరిమితం కాకుండా ఇతర అనారోగ్యాలకు దారితీస్తుంటాయి. చర్మ సమస్యల్లోనూ కొన్ని అలాంటి లక్షణాలను కలిగి ఉంటాయని నిపుణులు చెప్తున్నారు. సాధారణంగా కొన్నిసార్లు స్కిన్ నీలిరంగులోకి మారుతూ ఉంటుంది. మరి కొన్నిసార్లు ఎల్లో కలర్‌లో కనిపించవచ్చు. ఇంకొన్నిసార్లు ఎర్రటి మచ్చలు, దద్దుర్లు కనిపిస్తుంటాయి. అప్పుడప్పుడూ వచ్చిపోతే వీటిని సాధారణం అనుకోవచ్చు. కానీ తరచూ కనిపిస్తుంటే మాత్రం మీ గుండె బలహీన పడి ఉండవచ్చునని నిపుణులు చెప్తున్నారు. ఎందుకంటే కొన్ని రకాల స్కిన్ ప్రాబ్లమ్స్ గుండె జబ్బులతో ముడిపడి ఉంటాయని ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ నిపుణులు చెప్తున్నారు. అవేంటో చూద్దాం. మీ స్కిన్ లేదా పెదవులు, గోర్లు నీలం రంగులో మారుతాయి. బ్లడ్‌లో ఆక్సిజన్ లెవల్స్ తగ్గినప్పుడు ఇలా జరిగే అవకాశం ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే గుండె వైఫల్యానికి దారితీయవచ్చు. ఇది పుట్టుకతో వచ్చే గుండె లోపానికి వార్నింగ్ సిగ్నల్ కూడా కావచ్చు. కాబట్టి సైనోసిస్ బాధితుల్లో చర్మం రంగులు మారుతూ ఉంటే గనుక అవసరమైన టెస్టులు చేయించుకోవాలి. తగిన చికిత్స ద్వారా రాబోయే హార్ట్ ప్రాబ్లమ్స్‌ను నివారించవచ్చు. కొందరికి చేతి వేళ్లపైన గోర్ల చుట్టూ చీము పట్టడం, నొప్పి కలగడం వంటి ఇబ్బందులు కనిపిస్తుంటాయి. దీనినే క్లబ్బింగ్ అంటారు. రక్తంలో ఆక్సిజన్ చాలా తక్కువగా ఉండటం వల్ల ఇలా జరుగుతుంది. ఈ పరిస్థితి పుట్టుకతో వచ్చే గుండె జబ్బులవల్ల తలెత్తవచ్చు లేదా దీర్ఘకాలిక ఊపిరితిత్తుల వ్యాధులు ఉన్న వారిలోనూ ఈ సింప్టమ్స్ కనిపిస్తాయి. కొందరిలో శరీరంలో కొలెస్ట్రాల్ పేరుకుపోతుంది. చర్మంపై కొవ్వు నిల్వలు పసుపురంగు గడ్డలుగా కనిపిస్తే గనుక అనుమానించాల్సిందే. హై కొలెస్ట్రాల్ ఉన్నవారిలో ఈ సమస్య తలెత్తుతుంది. అయితే తరచుగా ఈ ప్రాబ్లమ్స్ రిపీట్ అవుతుంటే గనుక గుండె జబ్బులకు దారితీస్తాయి. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

# కాలిన గాయాలపై కోల్‌గేట్ రాస్తున్నారా...?



సాధారణంగా మన చేతులు, కాళ్లు ఏదైనా వేడి తాకి కాలిపోయిన తర్వాత అయ్యే గాయం పై చాలామంది ఐస్ లేదా కోల్ గేట్ రాసుకుంటూ ఉంటారు. ఇలా కొల్డ్ స్టఫ్‌ను అప్లైయ్ చేయడం వల్ల బొబ్బలు ఏర్పడకుండా ఆగిపోతుందని మనలో చాలా మంది భావిస్తూ ఉంటారు. అయితే వైద్యులు ఐస్ లేదా కోల్‌గేట్ గాయాలపై ఎప్పుడూ కూడా రాయొద్దని అంటున్నారు. దాని వెనుక కారణం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం.. కాలిన గాయాలపై ఐస్ లేదా కోల్‌గేట్ రాయడం చాలా ప్రమాదం అని అంటున్నారు నిపుణులు. అయితే ఐస్ పూయడం వల్ల ఆ ప్రాంతంలో బ్లడ్ సర్కులేషన్ ఆగిపోతుంది. దాని వల్ల ఆ గాయం మానడానికి చాలా సమయం పడుతుంది. అలాంటప్పుడు ఈ సమయంలో మనం కాలిన గాయాన్ని ఒక 15 నుంచి 20 నిమిషాల వరకు ట్యాప్ వాటర్ కింద ఉంచాలి. దీనివల్ల ఇన్ఫెక్షన్ సోకకుండా ఉంటుంది. అదేవిధంగా గాయం త్వరగా మానడానికి దోహద పడుతుంది. అదేవిధంగా చాలా మంది కాలిన ప్రదేశంలో నెయ్యి, లేదా ఆయిల్ కూడా రాస్తుంటారు. దీనివల్ల ఇన్ఫెక్షన్లు సోకి గాయం ఇంకా బాధిస్తుంది. అలా కాకుండా నీటితో గాయమైన ప్రాంతాన్ని శుభ్రంగా క్లీన్ చేసుకున్నాక ఏదైనా బర్న్ క్రీమ్ రాస్తే గాయాలు త్వరగా మానుతాయి. (గమనిక: క్రీమ్స్ డాక్టర్స్‌చే సూచించబడినది ఉండాలి). ఇంకా త్వరగా చికిత్స చేయాలంటే అలోవెరా జెల్ లేదా రోజ్ వాటర్ స్ప్రే చేయవచ్చు.

# వాల్యు మెట్రిక్ డైట్ అంటే ఏమిటి?



ఇటీవల పలువురు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యల్లో అధిక బరువు ఒకటి. ఇది క్రమంగా డయాబెటిస్, కార్డియో వాస్క్యులర్ ఇష్యూస్, హార్ట్ ఎటాక్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది కాబట్టి మొదట్లోనే కంట్రోల్ చేయాలని నిపుణులు సూచిస్తుంటారు. బాధితులు కూడా రకరకాల ప్రయత్నాలు చేస్తుంటారు. కొందరైతే బరువు తగ్గాలనే ఆశతో తక్కువ తింటూ ఇబ్బంది పడుతుంటారు. బలవంతంగా ఆకలిని చంపుకుంటూ పస్తులు ఉంటారు. అయితే ఇలా ఆకలిని కంట్రోల్ చేస్తూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా అధిక బరువు తగ్గించగల మార్గం ఒకటి ఉందని నిపుణులు చెప్తున్నారు. అదే 'వాల్యుమెట్రిక్ డైట్'. వాల్యు మెట్రిక్ డైట్‌లో భాగంగా కొద్ది మొత్తంలో తింటూనే కడుపు నిండేలా తగిన ప్రోటీన్స్, ఇతర పోషకాలు తీసుకుంటారు. ప్రోటీన్ లెవల్స్ అధికంగా ఉండి, తక్కువ కేలరీలు ఉన్న ఆహార పదార్థాలు, పండ్లు ఈ డైట్‌లో యూజ్ చేస్తారు. దీనివల్ల ఆకలిని కంట్రోల్ చేసుకోకుండా అవసరం అయినప్పుడల్లా కొద్ది మొత్తంలో తింటూ అధిక బరువును తగ్గించుకుంటారు. ఇలా కొంతకాలం ప్రయత్నించడంవల్ల అధిక బరువు తగ్గే అవకాశం ఉంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, మిల్లెట్స్ వంటివి వాల్యు మెట్రిక్ డైట్‌లో భాగంగా ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది. అంటే బరువు తగ్గేందుకు మొదట జంక్ ఫుడ్స్, హై కేలరీలు తగ్గించి వీటిని ఎక్కువ తీసుకోవాలి. కడుపు నిండే వరకు ఎన్ని పండ్లు అయినా తినవచ్చు. ఆ తర్వాత వాటిని జంక్ ఫుడ్, పండ్లను తగ్గిస్తూ మిల్లెట్స్ మొదలుపెట్టాలి. పండ్లను తగ్గించి మిల్లెట్స్‌ను మెయిన్ మీల్‌గా తీసుకోవాలి. ఇక ఆ తర్వాత కొన్ని రోజులకు ప్రొటీన్స్, హెల్దీ ఫ్యాట్స్‌ను కూడా యాడ్ చేసుకోవాలి. ఇలా ఆకలిని కంట్రోల్ చేయకుండా శరీరానికి క్రమంగా కేలరీలు తగ్గించడమే వాల్యు మెట్రిక్ డైట్ ప్రధాన ఉద్దేశం. దీనికోసం బరువు తగ్గడానికి పెద్దగా కష్టపడాల్సిన అవసరం ఉండదు. జిమ్‌కు వెళ్లి ఖర్చు చేసుకోవాల్సిన అవసరం కూడా తప్పుతుంది. కొందరైతే బరువు తగ్గాలనే ఆశతో తక్కువ తింటూ ఇబ్బంది పడుతుంటారు. బలవంతంగా ఆకలిని చంపుకుంటూ పస్తులు ఉంటారు. అయితే ఇలా ఆకలిని కంట్రోల్ చేస్తూ ఇబ్బంది పడాల్సిన అవసరం లేకుండా అధిక బరువు తగ్గించగల మార్గం ఒకటి ఉందని నిపుణులు చెప్తున్నారు.ల అదే 'వాల్యుమెట్రిక్ డైట్'.ఇలా కొంతకాలం ప్రయత్నించడంవల్ల అధిక బరువు తగ్గే అవకాశం ఉంటుంది. తాజా పండ్లు, కూరగాయలు, పప్పు ధాన్యాలు, మిల్లెట్స్ వంటివి వాల్యు మెట్రిక్ డైట్‌లో భాగంగా ఎక్కువగా తీసుకోవాల్సి ఉంటుంది.

# పురుషుల కొంప ముంచుతున్న ప్లాస్టిక్...



ప్లాస్టిక్ మన రెగ్యులర్ లైఫ్‌లో ఒక భాగం అయిపోయింది. అంతేకాకుండా మన శరీరంలో కూడా భాగం అయింది. వాటర్ బాటిల్, టీ కప్, పేపర్ ప్లేట్ ఇలా ఏదైనా ప్లాస్టిక్‌తో ముడిపడింది. ప్లాస్టిక్ ఉపయోగం మానవ జాతి మనుగడకు ముప్పులా మారింది. ప్లాస్టిక్?లో అత్యంత సూక్ష్మరూపంలో ఉండే ప్లాస్టిక్ రేణువులు గాలిలో చేరుతున్నాయి. మనం తీసుకునే డ్రింక్, ఫుడ్ ద్వారా నీరు, ఆహారంలో కలుస్తున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాల రేణువులు గాలి, నీరు, ఆహారం ద్వారా శరీరంలోకి ప్రవేశించి హృదయం, మెదడు, మూత్రపిండాలు, కాలేయం ఇలా శరీరంలోని ప్రతి అవయవంపై దుష్ప్రభావం చూపుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు.. మనిషి ఆరోగ్యంపై చాలా రకాలుగా చెడు ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్రమాదకరమైన మైక్రో ప్లాస్టిక్ శరీరంలోని అన్ని అవయవాలకు పాకుతుంది. ఈమధ్య న్యూ మెక్సికో వర్సిటీ పరిశోధకులు పురుషుడి వృషణాలో మైక్రో ప్లాస్టిక్ రేణువులను గుర్తించారు. చైనా పరిశోధకులు వీర్యకణాల్లోనూ ఈ ప్లాస్టిక్ కణాలు ఉన్నట్లు తేల్చారు. చైనాకు చెందిన ఆరోగ్యవంతులైన 36 మంది యువకుల శుక్రకణాలను ప్రయోగశాలలో పరీక్షించగా అన్ని శాంపిల్స్?లలో మైక్రో ప్లాస్టిక్ రేణువులు ఉన్నట్లు గుర్తించారు. ప్లాస్టిక్ వాటర్ బాటిల్లు, బ్యాగుల తయారీలో వాడే పాలి ఇథైలిన్, పాలివినైల్ క్లోరైడ్, పాలి స్టైయిరిన్ వంటి రేణువులను వీర్యంలో గుర్తించినట్లు పరిశోధకులు తెలిపారు. సంతాన ఉత్పత్తికి కీలకమైన శుక్రకణాల కదలికలను ప్లాస్టిక్ రేణువులు అడ్డుకుంటున్నాయని, శుక్రకణాల ఎదుగుదల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటలీలో నిర్వహించిన మరో అధ్యయనంలోని పురుషుల శుక్రకణాల్లో మైక్రో ప్లాస్టిక్‌ను గుర్తించినట్లు రిపోర్ట్స్ తెలుపుతున్నాయి. పురుష సంతానోత్పత్తి సామర్థ్యంపై ఇవి తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని.. ప్లాస్టిక్‌ను వీలైనంత ఎక్కువగా అవాయిడ్ చేయాలని సూచిస్తున్నారు.

# డస్ట్ అలర్జీకి కారణం ఏంటో తెలుసా..?



అలర్జీ అనేది దుమ్ము వల్ల కాదు, దుమ్ములో ఉండే చనిపోయిన పురుగులు, వాటి మురికిలో ఉండే ప్రోటీన్ల వల్ల వస్తుంది. అలర్జీ అనేది ప్రతి ఒక్కరూ ఎదుర్కొనే ఒక సాధారణ సమస్య. దీని వల్ల రోగనిరోధక శక్తి కూడా బలహీనపడుతుంది. దుమ్ము వల్ల చాలా మందికి అలర్జీ సమస్యలు వస్తుంటాయి. అలాగే, ఈ దుమ్ము వల్ల అనేక రకాల అలర్జీలు వస్తుంటాయి. ధూళి కణాలు స్వయంగా అలెర్జీ కారకాలు కావు. కానీ వాటిలో ఉండే చనిపోయిన సూక్ష్మ పురుగుల వల్ల కలుగుతాయి. కొన్ని రకాల రేణువుల నుంచి కూడా ఈ సమస్య పెరిగేలా చేస్తాయి. ముఖ్యంగా చలికాలంలో పూలు, చెట్లు, గడ్డి నుంచి కూడా డస్ట్ అలర్జీక్ రియాక్షన్స్ అధికంగా ఉంటాయి. గాలిలో ఉండే పుప్పొడి కణాలు, జంతువుల వెంట్రుకలు, చుండ్రు, ఫంగస్ ఇలా అనేక రకాల బ్యాక్టీరియా కూడా అలర్జీకి కారణమవుతాయి. శ్వాస ద్వారా శరీరంలోకి ప్రవేశించే ప్రొటీన్ వల్ల డస్ట్ మైట్ అలర్జీ వస్తుంది. హిస్టామిన్ కారణంగా శరీరంలో అలెర్జీ ప్రతిచర్య సంభవిస్తుంది. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ముక్కు కారడం, కళ్ల వాపు, ముక్కు, గొంతులో దురద, దగ్గు, తలనొప్పి, అలసట, బలహీనత వంటి సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

# బీరకాయతో ఆ సమస్యకు చెక్...?



బీరకాయ ఏడాది మొత్తంలో .. ఏ సమయంలోనైనా దొరుకుతుంది. దీనిలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అలాగే వీటిలో విటమిన్ సి, ఐరన్, ఇతర మినరల్స్ పుష్కలంగా ఉన్నాయి. కేలరీలు తక్కువగా ఉంటాయి. ఇది దోసకాయ కుటుంబానికి చెందిన కూరగాయ. బీరకాయలో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇది బరువు తగ్గాలనుకునే వారికీ సూపర్ ఫుడ్. బీరకాయలో కేలరీలు, సంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది తిన్న తర్వాత, ఎవరికైనా కడుపు నిండినట్లు అనిపిస్తుంది. బీరకాయలో విటమిన్ సి, ఐరన్, మెగ్నీషియం, జింక్ పుష్కలంగా ఉన్నాయి. రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి కూడా సహాయపడుతుంది. కాలేయం, కడుపు, మూత్రపిండాల ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బీరకాయ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. ఈ కూరగాయలలో మెగ్నీషియం, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ సమస్యను కూడా నివారిస్తాయి. ఇది బరువు తగ్గాలనుకునే వారికీ సూపర్ ఫుడ్. బీరకాయలో కేలరీలు, సంతృప్త కొవ్వు ఉంటుంది. ఇది బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఇందులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది.

# ట్రెండీ వేర్‌లో రతికా రోజ్ కిరాక్ పోజులు



## పోలీసాఫీసర్‌గా విజయశాంతి.. లేడీ సూపర్ స్టార్ ఈజ్ బ్యాక్..



లేడీ సూపర్‌స్టార్ అంటే విజయశాంతి గుర్తొస్తారు. ఆమె సృష్టించే ప్రభావం అలాంటిది. కథా బలం ఉన్న చాలా సినిమాల్లో ఆమె ప్రధాన పాత్రలు పోషించారు. అయితే రాజకీయాల కారణంగా కొన్నాళ్లు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విజయశాంతి... మహేష్ బాబు సరిలేరు నీకెవ్వరు సినిమాతో రీఎంట్రీ ఇచ్చి సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించింది. ప్రస్తుతం కళ్యాణ్ రామ్ హీరోగా రూపొందుతున్న “కళ్యాణ్ రామ్ 21” సినిమాలో విజయశాంతి కీలక పాత్రలో నటిస్తోంది. ఈరోజు, విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా, ఆమె పాత్ర గ్లింప్స్ గ్లింప్స్ ను రిలీజ్ చేశారు మేకర్స్. ఇందులో కూడా ఆమె పోలీసాఫీసర్‌గా నటిస్తోంది. దాదాపు 22 ఏళ్ల తర్వాత ఆమె పోలీస్ పాత్రలో నటిస్తోండటం విశేషంగా చెప్పుకోవాలి. ఇక ఇందులో కూడా ఆమె పాత్ర పేరు వైజయంతి ఐపీఎస్ కావడం విశేషం.

## కల్కి మూవీకి గుడ్‌న్యూస్.. రేట్లు పెంచుకునే చాన్స




ప్రభాస్ హీరోగా నటించిన మైథలాజికల్ సైన్స్ ఫిక్షన్ మూవీ కల్కి 2898 ఏడీ. మరో రెండు రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానున్న ఈ మూవీకి ఆంధ్రప్రధేశ్ ప్రభుత్వం శుభవార్త అందించింది. ఏపీలో కల్కి సినిమా అదనపు షోలు, టిక్కెట్ల ధరలు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# మళ్లీ లైమ్ లైట్ లోకి శ్రీలీల

టాలీవుడ్ ప్రేక్షకులకు కొత్త ‘పెళ్లి సందడి’ సినిమాతో పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రీలీల. మొదటి సినిమా డిజాస్టర్ అయినా కూడా లక్కీగా టాలీవుడ్ లో మంచి ఆఫర్లు దక్కాయి. ధమాకా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడం వల్ల శ్రీలీల ఒకే సారి డజను సినిమా ఆఫర్లను సొంతం చేసుకుంది. మహేష్ బాబు కు జోడీగా గుంటూరు కారం సినిమాలో నటించే అవకాశం సొంతం చేసుకుంది. ఆ మధ్య బ్యాక్ టు బ్యాక్ ఫ్లాప్స్ పడటంతో స్లో అయిన శ్రీలీల మళ్లీ స్పీడ్ పెంచింది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతుంది. ప్రస్తుతం ఈమె చేతిలో నాలుగు అయిదు సినిమాలు ఉన్నాయట. ఈసారి బిగ్ చాలెంజ్ కేవలం తెలుగు లో మాత్రమే కాకుండా తమిళంలో కూడా ఈ అమ్మడు సినిమాలు చేస్తుంది. కన్నడంలో ఈ అమ్మడికి పెద్ద హీరోలకు జోడీగా నటించే అవకాశాలు వస్తున్నాయని సమాచారం అందుతోంది. మొత్తానికి శ్రీలీల బిజీ బిజీగా ఉంది. తాజాగా ఈ అమ్మడు ఒక చిట్ చాట్ లో ఆసక్తికర విషయాలను వెల్లడించి అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది. కెరీర్ లో ఇంతగా సక్సెస్ అవ్వడానికి కారణం ఏంటి, మీరు పాటించే ప్రణాళికలు ఏంటి అన్నట్టుగా ప్రశ్నించిన సమయంలో అలాంటివి ఏమీ లేవు అన్నది. ప్రతి అవకాశం ను సద్వినియోగం చేసుకోవడం కోసం కష్టపడాలని కొత్త వారికి శ్రీలీల సలహాలు ఇచ్చింది. ఇటీవలే ఈ అమ్మడు రవితేజ సినిమాలో హీరోయిన్ గా నటించేందుకు ఎంపిక అయ్యింది. మరో వైపు పవన్ మూవీలో కూడా ఈ అమ్మడు నటించబోతున్న విషయం తెల్సిందే.



# వినియోగం పెంచేందుకు ట్యాక్స్‌లు తగ్గింపు....!

న్యూఢిల్లీ: దేశంలో వినియోగం పెంచేందుకు రానున్న బడ్జెట్‌లో రూ.50 వేల కోట్ల విలువైన ప్రయోజనాలను ప్రభుత్వం ప్రకటించనుందని అంచనా. ఇందులో ఇన్‌కమ్ ట్యాక్స్ రేట్లను తగ్గించడం, ఇతర నిర్ణయాలు కూడా ఉండే అవకాశం ఉంది. ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారికి రానున్న బడ్జెట్‌లో ఉపశమనం దొరకొచ్చని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేటగిరీలో ఉన్నవారిపై 5 శాతం నుంచి 20 శాతం వరకు ట్యాక్స్ పడుతోంది. రానున్న బడ్జెట్‌లో కొత్త స్లాబ్‌ను ఏర్పాటు చేసే వీలు కూడా ఉంది. ట్యాక్స్ రిలీఫ్స్ ఇవ్వడంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి. రిలీఫ్ చర్యల వలన ప్రభుత్వానికి ఆదాయం తగ్గినా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫిస్కల్ డెఫిసిట్‌ను జీడీపీలో 5.1 శాతానికే కుదించాలని కేంద్రం టార్గెట్‌గా పెట్టుకుంది. రూ.50 వేల కోట్ల విలువైన రిలీఫ్ చర్యల్లో సగం ట్యాక్స్ రేట్లను తగ్గించడం ద్వారా ప్రభుత్వం అందించనుందని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నారు. దీంతో పాటు చిన్న రైతులకు ఇచ్చే క్యాష్ పేమెంట్స్ ప్రస్తుతం ఉన్న ఏడాదికి రూ.6,000 నుంచి రూ.8 వేలకు పెంచాలని ప్రభుత్వం ప్లాన్ చేస్తోంది. ఉపాధి హామీ పథకం కింద చెల్లించే కనీస వేతనాలను కూడా పెంచాలని, మహిళా రైతులకు ఆర్థిక సాయం అందించాలని చూస్తోంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇండస్ట్రీ వర్గాలు, ఎకనామిస్ట్‌లు, ట్రేడ్ యూనియన్లతో ప్రీ బడ్జెట్ సమావేశాలను నిర్వహిస్తున్నారు. తాజా లోక్ సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకపోవడంతో మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజలను ఆకర్షించే స్కీమ్‌లను బడ్జెట్‌లో ప్రకటించొచ్చని ఎనలిస్టులు అంచనా వేస్తున్నారు.

ఇందులో ఇన్‌కమ్ ట్యాక్స్ రేట్లను తగ్గించడం, ఇతర నిర్ణయాలు కూడా ఉండే అవకాశం ఉంది. ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల మధ్య ఆదాయం ఉన్నవారికి రానున్న బడ్జెట్‌లో ఉపశమనం దొరకొచ్చని సంబంధిత వ్యక్తులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేటగిరీలో ఉన్నవారిపై 5 శాతం నుంచి 20 శాతం వరకు ట్యాక్స్ పడుతోంది. రానున్న బడ్జెట్‌లో కొత్త స్లాబ్‌ను ఏర్పాటు చేసే వీలు కూడా ఉంది. ట్యాక్స్ రిలీఫ్స్ ఇవ్వడంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయి.



## ప్రపంచంలోనే మూడో అతిపెద్ద మార్కెట్‌గా భారత్



ప్యాసింజర్ వాహనాలకు (పీవీ) సంబంధించి ప్రపంచంలోనే మూడో అతి పెద్ద మార్కెట్‌గా భారత్ ఎదిగింది. స్పోర్ట్ యుటిలిటీ వాహనాల (ఎస్‌యూవీ) వాటా ఇందులో దాదాపు సగం స్థాయిలో ఉంటోంది. దేశీయంగా గత ఆర్థిక సంవత్సరం 43 లక్షల యూనిట్లుగా ఉన్న పీవీల మార్కెట్ 2030 ఆర్థిక సంవత్సరం నాటికి అరవై లక్షలకు చేరొచ్చని, ఇందులో 20-21 శాతం వాటా ఎలక్ట్రిక్ వాహనాలదే (ఈవీ) ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే వాహనాల డిమాండ్‌కి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవడం, పర్యావరణ అనుకూల కొత్త టెక్నాలజీలను వినియోగంలోకి తేవడంపై ఆటోమొబైల్ కంపెనీలు మరింతగా దృష్టి పెడుతున్నాయి. వచ్చే కొన్నేళ్లలో ఇందుకోసం దాదాపు రూ. 2 లక్షల కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. మారుతీ సుజుకీ ఎస్‌యూవీ కేటగిరీలో తొలి ఈవీని గతేడాదే ఆవిష్కరించనున్నట్లు తొలుత ప్రకటించినా అది ఈ ఆర్థిక సంవత్సరానికి వాయిదా పడింది. 2029-30 నాటికి మొత్తం ఆరు ఈవీలను భారత్‌లో ప్రవేశపెట్టాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. 50 శాతం మార్కెట్ వాటాను తిరిగి దక్కించుకునే క్రమంలో సామర్థ్యాల పెంపు, కొత్త మోడళ్ల అభివృద్ధి మొదలైన వాటిపై 2024-25లో రూ. 10,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో సి ంహభాగం వాటా హరియాణా నాలోని ఖారో?డా ప్లాంటుపైనే వెచ్చించనుంది. 2025 నాటికి ఇందులో ఉత్పత్తి ప్రారంభం కానుండగా, సంస్థకు ఏటా 2,50,000 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం జత కానుంది.

## దిగ్గజ ఐపీవోలకు ఓకే.. సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన దిగ్గజం ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ, హెల్త్‌కేర్ రంగ కంపెనీ ఎమ్‌క్యూర్ ఫార్మాస్యూటికల్స్ పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఇందుకు తాజాగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ రెండు కంపెనీలూ 2023 డిసెంబర్‌లో సెబీకి ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేశాయి. ఐపీవో ద్వారా ఓలా ఎలక్ట్రిక్ రూ. 5,500 కోట్లకుపైగా సమీకరించే ప్రణాళికల్లో ఉంది. ఇష్యూ నిధులలో అత్యధిక శాతాన్ని సామర్థ్య విస్తరణ, సెల్ తయారీ ప్లాంట్, ఆర్‌అండ్‌డీపై పెట్టుబడులకు వినియోగించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 5,500 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి అదనంగా మరో 9.52 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రమోటర్లు, ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. రూ. 1,226 కోట్లు సెల్ తయారీ యూనిట్‌కు, రూ. 1,600 కోట్లు ఆర్‌అండ్‌డీకి, మరో రూ. 800 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. ఇక బెయిన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న ఎమ్‌క్యూర్ ఫార్మా రూ. 800 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. ఆఫీసర్స్ చాయిస్ విస్కీ తయారీ కంపెనీ అలైడ్ బ్లెండర్స్ పబ్లిక్ ఇష్యూకి రూ. 267-281 ధరల శ్రేణిని ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది.




## ఫుడ్ డెలివరీకి ప్లాస్టిక్ కంటైనర్‌లు ప్రమాదం...!



ప్రముఖ న్యూట్రిషనిస్ట్, లైఫ్‌స్టైల్ ఎక్స్‌పర్ట్ 'ల్యూక్ కౌటిన్హో' తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఫుడ్ డెలివరీ సర్వీస్ అండ్ రెస్టారెంట్‌ల ద్వారా ప్లాస్టిక్ కంటైనర్‌లను ఉపయోగించడం గురించి తన భయాన్ని తెలియజేసారు. వేడి ఆహారాన్ని ప్యాక్ చేయడానికి ప్లాస్టిక్ కంటైనర్ల వాడకం అనారోగ్యానికి కారణమవుతుందని పేర్కొన్నారు. బయోడిగ్రేడబుల్ మెటీరియల్‌లను ఫుడ్ డెలివరీ చేయడానికి ఉపయోగించాలని ప్లాట్‌ఫామ్‌లను కోరారు. స్విగ్గీ, జొమాటో, రెస్టారెంట్‌లు.. బయోడిగ్రేడబుల్ నాన్ ప్లాస్టిక్ కంటైనర్‌లలో ఫుడ్ డెలివరీలు జరిగేలా చూడాలని విన్నవించారు. మంచి ఆహారాన్ని మాత్రమే కాకుండా ప్లాస్టిక్ వాడకం నియంత్రించి ఆరోగ్యాన్ని కూడా అందించాలని కోరారు. ప్లాస్టిక్‌లోని వేడి ఆహారాలు ప్రజలను అనారోగ్యానికి గురిచేస్తున్నాయి వెల్లడిస్తూ.. హార్మోన్లు, సంతానోత్పత్తి, ఈస్ట్రోజెన్‌ల ఉత్పత్తి కూడా తగ్గుతుందని ల్యూక్ కౌటిన్హో పేర్కొన్నారు. కౌటిన్హో సందేశానికి దీపిందర్ గోయల్ రిప్లై ఇచ్చారు. ల్యూక్‌కు ధన్యవాదాలు తెలియజేస్తూ.. మేము చేయగలిగినంత తప్పకుండా చేస్తాము. బయోడిగ్రేడబుల్ ప్యాకేజింగ్‌కు ప్రాధాన్యత ఇస్తానని, తద్వారా కౌటిన్హో కోరుకున్న దిశలో అడుగులు వేస్తానని వాగ్దానం చేసారు. దీపిందర్ గోయల్ రిప్లైకు కౌటిన్హో కృతజ్ఞతలు తెలిపారు. నా మాటలను అంగీకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. బయోడిగ్రేడబుల్ నాన్ ప్లాస్టిక్ కంటైనర్‌లలో ఫుడ్ డెలివరీలు జరిగేలా చూడాలని విన్నవించారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కీలక నిర్ణయం





ఇటీవల కాలంలో భారతదేశంలో యూపీఐ చెల్లింపులు గణనీయంగా పెరిగాయి. అన్ని బ్యాంకులు తమ ఖాతాదారులకు యూపీఐ సేవలను అందిస్తున్నాయి. అయితే జూన్ 25 నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తక్కువ విలువ యూపీఐ లావాదేవీల కోసం టెక్స్ట్ హెచ్చరికలను పంపడం ఆపివేస్తున్నట్లు పేర్కొంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కస్టమర్లు రూ. 100 నుంచి రూ.5000 వరకూ యూపీఐ లావాదేవీలు చేస్తే ఇకపై అలెర్ట్ మెసేజ్‌లు రావు. అంతకంటే ఎక్కువ మొత్తం లావాదేవీలకు మాత్రమే అలెర్ట్ మెసేజ్‌లు వస్తాయి. అయితే హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎటువంటి మార్పు లేకుండా అన్ని లావాదేవీలకు ఈ-మెయిల్ హెచ్చరికలను పంపుతామని పేర్కొంది. ఈ నేపథ్యంలో కస్టమర్లు తక్కువ విలువ లావాదేవీల వివరాల కోసం ఈ-మెయిల్ సేవలను ఉపయోగించాలని కోరింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బ్యాంకింగ్ నిబంధనలకు అనుగుణంగా ఈ మార్పులు చేసింది. రూ. 5,000 కంటే ఎక్కువ లావాదేవీలకు టెక్స్ట్ సందేశాలు అవసరం. అయినప్పటికీ చాలా బ్యాంకులు తక్కువ విలువ డెబిట్ ల కోసం హెచ్చరికలను పంపుతాయి. ముఖ్యంగా చాలా తక్కువ మొత్తం చెల్లింపులకు యూపీఐ సేవలను వాడడంతో ఈ మెసేజ్‌లు సగటు వినియోగదారులకు చిరాకు తెప్పిస్తున్నాయి. ముఖ్యంగా ఈ లావాదేవీల అలెర్ట్ మెసేజ్‌ల నోటిఫికేషన్లు కొన్ని సార్లు నకిలీ కూడా వస్తున్నాయని గుర్తించి ఈ మెసేజ్‌లు సగటు వినియోగదారులకు ఉపయోగకరంగా ఉండవని హెచ్‌డీఎఫ్‌సీ భావించి ఈ సేవలను నిలుపుదల చేసింది.

## రూ. 8 లక్షల్లో మారుతి కొత్త కారు..




ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ మారుతికి భారత్‌లో ఎలాంటి ఆదరణ ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దేశంలో అత్యధికంగా అమ్ముడయ్యే వాహనాల్లో మారుతి సుజుకి ప్రథమ స్థానంలో ఉంటుంది. ఎప్పటికప్పుడు కొంగొత్త వాహనాలతో కస్టమర్లను ఆకర్షిస్తున్న మారుతి సుజుకి తాజాగా మారుతీ సుజుకీ ఫ్రాంక్స్?కి సరికొత్త ఎడిషన్‌ను తీసుకొచ్చింది. ఫ్రాంక్స్ వెలాసిటీ ఎడిషన్ పేరుతో ఈ కారును లాంచ్ చేశారు. ఇంతకీ కారు ధర ఎంత.? ఎలాంటి స్పెసిఫికేషన్లు ఉన్నాయి.? ఇప్పుడు తెలుసుకుందాం.. ఈ కారు మొత్తం 14 వేరియంట్స్‌లో అందుబాటులోకి వచ్చింది. ఫ్రాంక్స్ వెలాసిటీ నేచురల్ ఆస్పిరేటెడ్ పెట్రోల్, సీఎన్?జీ ఇంజిన్ ఆప్షన్స్‌లో అందుబాటులోకి వచ్చింది. ఈ ఎస్‌యూవీ కారు ప్రారంభ వేరియంట్ ఎక్స్ షోరూమ్ ధర రూ. 7.29 లక్షలుగా నిర్ణయించారు. ఈ కారు ఫీచర్ల విషయానికొస్తే ఇందులో.. 1.2 సిగ్మా వెలాసిటీ ఫ్రంట్ బంపర్, హెడ్?ల్యాంప్, వీల్?ఆర్చ్‌లతో పాటు 1.0-లీటర్ టర్బో పెట్రోల్ వేరియంట్లలో, ఫ్రాంక్స్ డెల్టా ం వెలాసిటీ లోయర్ ట్రిమ్స్ నుంచి అన్ని గార్నిష్? ఎలిమెంట్స్‌ను అందించారు. ఇక కార్బన్ ఫినిష్ ఇంటీరియర్ స్టైలింగ్ కిట్, 3డీ బూట్ మ్యాట్ వంటి ఇంటీరియర్ యాక్సెసరీలు ఈ కారు ప్రత్యేకతలుగా చెప్పొచ్చు. బోల్డ్ ఎస్‌యూవీ అనుభవాన్ని కోరుకునే వారి కోసం ఈ కారు ఉపయోగపడుతుందని మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ మార్కెటింగ్ అండ్? సేల్స్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థ బెనర్జీ తెలిపారు. ఈ కారు కేవలం పది నెలల్లో లక్ష అమ్మకాలను సాధించిందని తెలిపారు.

## జీఎస్టీ స్లాబులు తగ్గాలి




**న్యూఢిల్లీ :** వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్లాబుల సంఖ్యను తగ్గించాలని గ్లోబల్ ట్రేడ్ రిసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్‌ఐ) కేంద్ర ప్రభుత్వానికి, జీఎస్టీ మండలికి శుక్రవారం సూచించింది. శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరుగనున్నది. ఈ క్రమంలోనే జీఎస్టీ మినహాయింపు పరిమితిని రూ.1.5 కోట్ల వార్షిక టర్నోవర్‌దాకా ఉన్న అన్ని సంస్థలకు పెంచాలని కూడా జీటీఆర్‌ఐ కోరింది. ప్రస్తుతం ఇది రూ.40 లక్షలుగానే ఉన్నది. పరిమితిని పెంచితే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లకు లబ్ధి చేకూరుతుందని, ఉద్యోగ-ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జీటీఆర్‌ఐ ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది.

## ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్....!



ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ యూజర్ల కోసం 'క్లోజ్ ఫ్రెండ్స్ ఆన్ లైవ్' అనే సరికొత్త ఫీచర్ తీసుకువచ్చింది. ఇప్పటి వరకు లైవ్ స్ట్రీమ్ అనేది ఫాలోవర్స్ అందరికి కనిపించేది. తాజాగా అందుబాటులోకి వచ్చిన కొత్త ఫీచర్ క్లోజ్ ఫ్రెండ్స్ జాబితాలో ఉన్నవారిని మాత్రమే అనుమతిస్తుంది. క్లోజ్ ఫ్రెండ్స్ జాబితాలో కావలసిన వాళ్ళను యాడ్ చేసుకోవచ్చు, లేదా రిమూవ్ చేయవచ్చు. యూజర్ల భద్రతకు పెద్దపీట వేయడానికి ఇన్‌స్టాగ్రామ్ ఈ కొత్త ఫీచర్ తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. గతంలో ఇన్‌స్టా అకౌంట్ పబ్లిక్ అయితే ఎవ్వరైనా లైవ్ స్ట్రీమింగ్‌లో జాయిన్ అవ్వడానికి అవకాశం ఉండేది. ఇప్పుడు అందుబాటులోకి వచ్చిన ఈ ఫీచర్ ద్వారా.. యూజర్ లైవ్ స్ట్రీమింగ్‌లో ఎవరైతే ఉండాలనుకుంటారో వారిని మాత్రం క్లోజ్ ఫ్రెండ్స్ జాబితాలో యాడ్ చేసుకోవచ్చు.

# సింగరేణి గనుల వేలం ఆపాలి: కోదండరాం

హైదరాబాద్: సింగరేణి గనుల వేలాన్ని ఆపాలని తెలంగాణ జనసమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సింగరేణి ఉత్తర తెలంగాణకు గుండెకాయ అని ఆయనన్నారు. సోమవారం నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రొఫెసర్ కొదండరామ్ మాట్లాడారు. ఉత్తర తెలంగాణలో సింగరేణి ద్వారా అనేక మంది జీవితాలు బాగు పడ్డాయని ఆయన తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో బొగ్గు గనుల వేలం గురించి చర్చ జరుగుతోందన్నారు. 1973లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ ప్రభుత్వం పార్లమెంట్ చట్టం ద్వారా బొగ్గు గనులను జాతీయం చేశారని కోదండరాం గుర్తుచేశారు. బొగ్గుగనులను జాతీయం చేయడానికి వేసిన కమిటీలో అధికారి శంకరన్ కార్యదర్శిగా ఉన్నారని, ఆ ఫైల్స్‌ను శంకరన్ తనకు చాలా సార్లు చూపించారని ఆయన గుర్తుచేశారు. పర్యావరణ విధ్వంసం, విపరీతమైన దోపిడీ, తక్కువ జీతాల కారణంగా ఆ రోజుల్లో అన్ని బొగ్గు గనులను జాతీయం చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. బొగ్గు గనులను మాఫియా గ్యాంగులు నిర్వహిస్తూ ఉండేవని, వాటి నుంచి విముక్తి కలిగించే లక్ష్యంతోనే అప్పటి ప్రభుత్వం ఓ కమిషన్ వేసి జాతీయం చేసిందని కోదండరాం తెలిపారు. తర్వాత సరళికరణ యుగం మొదలైన తర్వాత 1989 నుంచి చాలా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేశారని, ఆ సమయంలోనే బొగ్గు గనులను కూడా ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం ప్రారంభమయ్యిందన్నారు. విద్యుత్ ఉత్పత్తి చేసేవారికి గనులు అప్పజెప్పారని, ఈ క్రమంలోనే అక్రమాలు, అవినీతి జరిగిందని ఆరోపణలు ఉన్నాయన్నారు. సుప్రీం కోర్టు ఈ కేటాయింపులను విశ్లేషించిన తర్వాత గనులను కేటాయించే టప్పుడు వేలం పద్దతిని పాటించాలని, ఎవరూ బహిరంగ టెండర్ వేస్తే వారికే ఇవ్వాలని తీర్పు చెప్పిందన్నారు. ఆ తీర్పు ప్రకారం బొగ్గు గనులను వేలం వేయడానికి అవకాశం కల్పించారన్నారు. అది ప్రైవేటీకరణను నియంత్రించడానికి వచ్చిన చట్టమని చెప్పారు. ప్రైవేటీకరణ వల్ల కలిగే అక్రమాలు, అవినీతిని నిలువరించేందుకు వచ్చిన చట్టమని గుర్తుచేశారు. ఈ చట్టం వచ్చేనాటికి దేశంలో కోల్ ఇండియా, సింగరేణి ఉందన్నారు. అయితే గనులను కచ్చితంగా వేలం వేయాలని సుప్రీంకోర్టు చెప్పలేదని స్పష్టంచేశారు. కేంద్రం బొగ్గు గనులను ప్రైవేటుపరం చేస్తామంటే కుదరదన్నారు. తెలంగాణ అస్థిత్వాలు మరిచి నిర్ణయాలు చేయవద్దని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సింగరేణి గనులను వేలం ఆపాలని, వీలైతే మరిన్ని గనులను సింగరేణికి కేటాయించి, సింగరేణికే బొగ్గును తవ్వే అధికారం ఇవ్వాలని ప్రొఫెసర్ కోదండరాం కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# పుష్పక్ తీన్‌మార్




పునర్వినియోగం వాహకనౌకల (రీయూజబుల్ లాంచ్ వెహికల్ ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్ ఆర్ఎల్‌వి ఎల్ఇఎక్స్) సామర్థ్యాన్ని పరీక్షించే ప్రయోగం మూడోసారి విజయవంతమైనట్టు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో వెల్లడించింది. అంతరిక్షం నుంచి వచ్చే వాహక నౌక పనితీరు, ల్యాండింగ్ పరిస్థితులను తాజా ప్రయోగం ద్వారా కళ్లకు కట్టినట్టు పేర్కొంది. అంతరిక్షం లోకి ప్రయోగించిన ఉపగ్రహాల్లోని విడిభాగాలు , వాటిని మోసుకెళ్లే వాహకనౌకల పునరుద్ధరణ దిశగా ఇస్రో ఈ ఆర్ఎల్‌వీ ఎల్ఈఎక్స్ ప్రయోగాలను చేపడుతోంది. తద్వారా ఆర్ఎల్‌వీల అభివృద్ధికి అవసరమైన అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందడంలో ఇస్రో నైపుణ్యాన్ని తాజా ప్రయోగం పునరుద్ఘాటిస్తున్నట్టు తెలిపింది. ల్యాండింగ్ ఎక్స్‌పెరిమెంట్ (ఎల్ఇఎక్స్ 03) సిరీస్‌లో చివరి పరీక్షను కర్ణాటక చిత్రదుర్గ లోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ (ఎటిఆర్)లో ఆదివారం ఉదయం నిర్వహించినట్టు వెల్లడించింది. ఆర్ఎల్‌వీ ఎల్ఈఎక్స్01, ఎల్ఈఎక్స్ 02 మిషన్ విజయవంతమైన తర్వాత మూడో ప్రయోగాన్ని మరిన్ని సవాళ్లు, తీవ్రమైన గాలి పరిస్థితుల్లో చేపట్టినట్టు తెలిపింది. తద్వారా స్వయం ప్రతిపత్తి ల్యాండింగ్ సామర్థ్యాన్ని తిరిగి సందర్శించినట్టు వివరించింది. 'పుష్పక్ ' పేరుతో పిలిచే ఈ రెక్కల వాహనాన్ని భారతీయ నౌకాదళానికి చెందిన చినూక్ హెలికాప్టర్ ద్వారా తీసుకెళ్లి రన్‌వేకి నాలుగు కిలోమీటర్ల దూరం , 4.5 కిలోమీటర్ల ఎత్తులో జారవిడిచారు. అక్కడి నుంచి క్రాస్ రేంజ్ కదలికలను స్వతంత్రంగా చేపడుతూ రన్‌వే దిశగా వచ్చింది. సెంటర్‌లైన్ వద్ద కచ్చితమైన సమాంతర ల్యాండింగ్‌ను ప్రదర్శించింది. తక్కువ లిఫ్ట్‌టుడ్రాగ్ నిష్పత్తితో కూడిన ఏరోడైనమిక్ కాన్ఫిగరేషన్ కారణంగా ల్యాండింగ్ వేగం గంటకు 320 కిలోమీటర్ల కంటే ఎక్కువగా ఉందని ఇస్రో తెలిపింది. ఇది వాణిజ్య విమానాల్లో 260kmph, యుద్ధ విమానాల్లో 280kmph వరకు ఉంటుందని గుర్తు చేసింది. రన్‌వే పై ల్యాండ్ కాగానే వాహకనౌక వేగం బ్రేక్ పారాచూట్‌తో 100kmph కు తగ్గిందని ఇస్రో తెలియజేసింది. అనంతరం ల్యాండింగ్ గేర్లు బయటకు వచ్చి వాహనం పూర్తిగా ఆగిపోయినట్టు వెల్లడించింది. ఈ సమయంలో స్థిరత్వం కోసం నోస్ వీల్ స్టీరింగ్ వ్యవస్థ , రడ్డర్‌ను ఆర్ఎల్‌వీ ఉపయోగించుకున్నట్టు వెల్లడించింది. ఎల్ఈఎక్స్02 ప్రయోగంలో ఉపయోగించిన రెక్కల వాహనం ,ఫ్రయిట్ సిస్టమ్స్‌ను ఎలాంటి మార్పులు లేకుండా తాజా ప్రయోగంలో వాడినట్టు తెలియజేసింది.

## చెంచు మహిళ ఈశ్వరమ్మ ఘటనలో కొత్త కోణం...

# మేనమామ హత్య

నాగర్ కర్నూల్: భూమి అమ్మడం లేదని 20 రోజుల క్రితం ఈశ్వరమ్మ మామ నాగన్నను హత్య చేసిన విషయం ఇవాళ వెలుగులోకి వచ్చింది. చెంచుల భూముల పై కొంత మంది గ్రామస్థులు కన్నేశారు. ఈ నెల 3న ఈశ్వరమ్మ చిన్నమామ కాట్రాజు నాగన్న (56)కు చెందిన 2.5 ఎకరాల భూమిని బండి వెంకటేష్ ఎకరా రూ. 20 లక్షలు పలుకుతుండగా రూ. 4.5 లక్షల చొప్పున ఇవ్వాలని ఒత్తిడి చేశాడు. అందుకు నాగన్న ఒప్పుకోకపోవడంతో గ్రామ శివారులో అతడిని హత్య చేశారు. శవ పరీక్ష నిర్వహించకుండానే అంత్యక్రియలు చేశారు. భూతగాదా నేపథ్యంలో నాగన్నను హత్య చేసి ఉంటారనే ఆరోపణలు వస్తున్నాయి. చెంచుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని వారి భూమిని దక్కించుకునేందుకు నాగన్న హత్య చేసేందుకు కూడా వెనకడలేదన్న అనుమానాలు వ్యక్తవుతున్నాయి. చెంచు మహిళ ఈశ్వరమ్మ భూమిని కౌలు తీసుకున్న వ్యక్తులు ఆమెపై పాశవికంగా దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపిన విషయం తెలిసిందే. నాగర్ కర్నూల్ – కొల్లాపూర్ మండలం మొలచింతలపల్లి గ్రామంలో బాధితురాలు చెంచు మహిళ ఈశ్వరమ్మ, భర్త ఈదన్న తమ వ్యవసాయ భూమిని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్ అనే వ్యక్తికి కౌలుకు ఇచ్చారు. ఆ భూమిలో వెంకటేశ్ ఫిల్టర్ ఇసుక తయారీ కేంద్రం పెట్టుకోగా తన దగ్గరే ఈదన్న, బాధితురాలు ఈశ్వరమ్మ పని చేసేవారు. ఈశ్వరమ్మ పనికి రావడంలేదని ఆమె మర్మంగాలపై కారం చల్లి, డీజిల్ పోసి నిప్పంటించి పాశవికంగా దాడి చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈశ్వరమ్మ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. నిమ్స్ లో ఈశ్వరమ్మను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. ఆమె కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని నిమ్స్ వైద్యులకు ఆదేశించారు.





## 'కేరళ'ను 'కేరళం'గా మార్చాలని కోరుతూ అసెంబ్లీలో తీర్మానం

తిరువనంతపురం: కేరళ రాష్ట్రం పేరును 'కేరళం'గా మార్చడానికి రాజ్యాంగ సవరణను తీసుకురావాలని కేంద్రాన్ని కోరుతూ ఆ రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించిన దాదాపు ఏడాది పూర్తయిన తర్వాత, సోమవారం చిన్న చిన్న సవరణలతో అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించింది. సవరణలు కోరుతూ కేంద్రం నాటి తీర్మానాన్ని వెనక్కి పంపించింది. దీంతో సభ సవరణలు చేస్తూ తీర్మానం చేసింది. రాజ్యాంగంలోని మొదటి షెడ్యూల్‌లో రాష్ట్రాన్ని అధికారికంగా 'కేరళం'గా మార్చడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. పేరు మార్పునకు చెందిన తీర్మానాన్ని ఆమోదం కోసం త్వరలో కేంద్రానికి పంపనున్నారు.




# రాజ్యాంగంపై దాడిని అనుమతించేది లేదు: రాహుల్ గాంధీ




న్యూఢిల్లీ : ప్రధాని నరేంద్రమోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాలు రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, దీనిని ఇండియా కూటమి ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో ఆయన సోమవారం విలేఖరులతో మాట్లాడారు. ఈవిధమైన దాడి తమకెవరికీ అంగీకారం కాదని పేర్కొన్నారు. ప్రతిపక్షాల సందేశం ప్రజలకు చేరుతోందా? అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ తమ సందేశం ప్రజలకు చేరుతోందన్నారు. ఏ శక్తీ రాజ్యాంగాన్ని తాకలేదని, దాన్ని తాము రక్షిస్తామని చెప్పారు. ఇదిలా ఉండగా 18వ లోక్‌సభ మొదటి సమావేశాలు ప్రారంభం సందర్భంగా ప్రతిపక్ష ఎంపీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. రాజ్యాంగ ప్రతిని చేతపట్టుకుని రాజ్యాంగాన్ని రక్షించాలని నినాదాలు చేశారు. తరువాత ఎక్స్ పోస్ట్‌లో రాహుల్ నరేంద్రమోడీపై విమర్శలు గుప్పిస్తూ తన ప్రభుత్వాన్ని కాపాడుకునే పనిలో మోడీ నిమగ్నమయ్యారన్నారు. బలమైన విపక్షం ఇండియా కూటమి ప్రజల గొంతు బలంగా వినిపిస్తుందని, ప్రధాని మోడీ జవాబుదారీ కాకుండా తప్పించుకోకుండా చూస్తామన్నారు. "ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన మొదటి 15 రోజుల్లోనే ఘోరమైన రైలు ప్రమాదం, కశ్మీర్‌లో ఉగ్రదాడి, రైళ్లలో ప్రయాణికుల బాధలు, నీట్‌స్కామ్, నీట్‌పీజీ రద్దు, యుజిసి నెట్ పేపర్ లీక్, పాలు, కాయధాన్యాలు, గ్యాస్, టోల్ ధరలు పెరుగుదల, అడవులు అగ్నికి ఆహుతి కావడం, నీటి సంక్షోభం, హీట్‌వేవ్‌లో సదుపాయాలు కరువై మరణాలు సంభవించడం ఇవన్నీ జరిగాయి" అని రాహుల్ వ్యాఖ్యానించారు.

## బెంగాల్ ప్రభుత్వం లేకుండా తీస్తా చర్చలా?: మమతా



న్యూఢిల్లీ: తీస్తా నదీ జలాల పంపిణీపై ఇటీవల బంగ్లాదేశ్, కేంద్ర ప్రభుత్వం మధ్య జరిగిన చర్చల్లో తమ రాష్ట్ర ప్రభుత్వాన్ని మినహాయించడంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్చలు ఏకపక్షంగా జరిగాయని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె ప్రధాని మోడీకి లేఖ రాశారు. బంగ్లాదేశ్‌తో జరిగిన చర్చలకు తమను ఆహ్వానించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం తీసుకోకుండా అలాంటి చర్చలు చేపట్టడం సరికాదని, ఈ చర్చలను తాము ఆమోదించలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌తో భౌగోళికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా పశ్చిమబెంగాల్‌కు సన్నిహిత సంబంధం ఉందని మమత వివరించారు. గంగానది, తీస్తానది జలాల వాటా అంశంపై ఇటీవల బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మోడీ మధ్య చర్చలు జరిగాయి. భారత్, బంగ్లాదేశ్ మధ్య ఉన్న ఫరక్కా ఒప్పందాన్ని పునరుద్ధరించాలన్న ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోందని, 1996లో కుదిరిన ఆ ఒప్పందం 2026 లో ముగిసిపోనున్నదని, ఆ ఒప్పందం ప్రకారం భారత్, బంగ్లా మధ్య నీటి పంపిణీ జరుగుతోందని మమత పేర్కొన్నారు. పశ్చిమబెంగాల్‌పై ఈ ఒప్పందం ప్రభావం ఉంటుందని ఆమె లేఖలో తెలిపారు. అలాంటి ఒప్పందాల వల్ల బెంగాల్ ప్రజలు తీవ్ర ప్రభావానికి గురవుతారన్నారు. ఈ విషయంలో రాజీ పడేది లేదని ఆమె స్పష్టం చేశారు.

**నీట్ పరీక్ష వ్యవస్థను రద్దు చేయాలని ప్రధానికి వినతి**

నీట్ పరీక్ష వ్యవస్థను రద్దు చేయాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ లేఖలో ప్రధాని నరేంద్రమోడీని అభ్యర్థించారు. నీట్ యుజి పరీక్షలో అవకతవకలకు బాధ్యులైన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పేపర్ లీకేజిని దృష్టిలో పెట్టుకుని ఆ పరీక్షలను రాష్ట్రాలే నిర్వహించేలా తిరిగి పాత పద్ధతిని అమలు చేయాలని సూచించారు. దీనివల్ల సాధారణ పరిస్థితి నెలకొంటుందని, అభ్యర్థుల్లో నమ్మకం పెరుగుతోందని పేర్కొన్నారు.

## కవచ్ ఆధునిక వర్షన్‌పై రైల్వే మంత్రి సమీక్ష



న్యూఢిల్లీ: రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఢిల్లీలోని రైల్ భవన్‌లో 'ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ' (ఎటిపి) కవచ్ 4.0 ఆధునిక వర్షన్ పురోగతిని సమీక్షించినట్లు అధికారులు సోమవారం వెల్లడించారు. కవచ్ 3.2 వర్షన్‌ను ఆమోదిత అధిక రద్దీ రూట్లలో అమరుస్తున్నట్లు రైల్వే అధికారులు తెలియజేశారు. స్వల్ప వ్యవధిలో విస్తృత రైల్వే నెట్‌వర్క్‌కు వర్తింపచేసేందుకు కొత్త రూట్లలో తాజా వర్షన్ అప్‌గ్రేడ్ చేయడం, ఏర్పాటు చేయడం ఒకేసారి జరుగుతుందని వారు తెలిపారు. వైష్ణవ్ కవచ్ 4.0 పురోగతిని ఈ నెల 22న సమీక్షించినట్లు వారు వెల్లడించారు. '4.1 వర్షన్ ఆధునిక దశ పరీక్షలో పాల్గొంటున్న కవచ్ తయారీదారులు ముగ్గురు దాని ప్రగతి నివేదికను మంత్రికి అందజేసినట్లు సీనియర్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఆధునిక వర్షన్ పురోగతిని మంత్రి సమీక్షించిన తరువాత అది సిద్ధమైన వెంటనే మిషన్ మోడ్‌లో దశల వారీగా కవచ్‌ను అమర్చాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు, కాగా, కవచ్ అభివృద్ధి రైల్వే భద్రతలో గణనీయమైన మైలురాయి అని రైల్వే మంత్రిత్వశాఖ చెబుతున్నది. ప్రపంచంలోని పలు ప్రధాన రైల్వే వ్యవస్థలు 1980 దశకంలో ఎటిపిను ప్రవేశపెట్టగా, భారతీయ రైల్వేలు 2016లో రైళ్ల ఢీ నిరోధక వ్యవస్థ (టిసిఎఎస్) తొలి వర్షన్ ఆమోదంతో ఈ ప్రస్థానాన్ని ప్రారంభించినటుల వైష్ణవ్ గతంలో పలు సందర్భాల్లో వెల్లడించారు.

## ఆగస్టు 1 నుంచి కొత్త రిజిస్ట్రేషన్ విలువలు అమలు!

**హైదరాబాద్:** రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువల సవరణ కసరత్తు కొలిక్కి వస్తోంది. ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల కనీస విలువపై స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఓ అభిప్రాయానికి వచ్చింది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. రాష్ట్రంలోని ప్రతి ఎకరా వ్యవసాయ భూమి కనీస విలువను రూ.4 లక్షలుగా నిర్ధారించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. వాస్తవానికి ఈ విలువను రూ.4–5 లక్షలుగా నిర్ణయించాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మౌఖికంగా సూచించింది.

అయితే ఏజెన్సీ ఏరియాల్లో ఈ విలువలు సరిపోయే అవకాశం లేనందున భద్రాచలం, ములుగు, ఆసిఫాబాద్ లాంటి ఏజెన్సీ ప్రాంతాలు మినహా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూమి కనీస రిజిస్ట్రేషన్ విలువను రూ.4 లక్షలు చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. అదే విధంగా నివాస స్థలాల కనీస విలువ ప్రతి చదరపు గజానికి రూ.1,000, అపార్ట్‌మెంట్ల కంపోజిట్ విలువ (చదరపు అడుగు) రూ.1,500గా ప్రతిపాదించాలని నిర్ణయించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చదరపు గజం కనీస విలువ రూ.500గా ప్రతిపాదించనున్నారు.

ఈ మేరకు జరుగుతున్న కసరత్తు 90 శాతం పూర్తయిందని, సోమవారం సాయంత్రానికి రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో ఏర్పాటు చేసిన కమిటీలు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సమరి?పంచనున్నాయని తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రతిపాదనలపై ఈ నెల 25వ తేదీన ఆ శాఖ ఐజీ సమీక్ష నిర్వహించాల్సి ఉంది. అయితే ఆర్‌సీసీ నిర్మాణాలు, రేకుల షెడ్లకు సంబంధించిన కనీస విలువల నిర్ధారణకు సంబంధించిన మార్గదర్శకాలు ఇంకా వెలువడాల్సి ఉందని, ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

**మూడు కేటగిరీల్లో వ్యవసాయ భూముల విలువల సవరణ**

రాష్ట్రంలోని భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువను సవరించే ప్రక్రియలో భాగంగా వ్యవసాయ భూముల విలువలను మూడు కేటగిరీలుగా నిర్ధారించనున్నారు. గ్రామాల్లోని వ్యవసాయ భూములు (ఎక్కువ సర్వే నంబర్లలో ఇదే విలువ ఉంటుంది), రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కన ఉండే వ్యవసాయ భూములు, వ్యవసాయేతర అవసరాలకు (వెంచర్లకు) వినియోగించేందుకు సిద్ధంగా ఉన్న భూములు..ఇలా మూడు కేటగిరీల్లో విలువలను నిర్ణయించనున్నారు.

హైవేల పక్కన వ్యవసాయ భూముల విలువను రూ.40–50 లక్షల వరకు సవరించే అవకాశముందని, వ్యవసాయేతర అవసరాలకు సిద్ధంగా ఉన్న (ప్లాట్లుగా చేసేందుకు) భూమి విలువను రూ.కోటి వరకు సవరిస్తారని తెలుస్తోంది. అయితే మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సమీపంలో ఉన్న భూములకు, హైవేల పక్కనే ఉన్న నివాస ప్రాంతాలకు దూరంగా ఉండే భూములకు విలువల్లో తేడా ఉంటుందని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు చెబుతున్నారు. సబ్ డివిజన్ సర్వే నంబర్లు, మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, హెచ్ఎండీఏ, ఇతర నగర అభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల ప్రాతిపదికన వ్యవసాయ భూములు, ఆస్తుల సవరణ ప్రక్రియ సాగుతోందని అంటున్నారు.

**వాణిజ్య ప్రాంతాలు మిస్ కాకుండా ప్రత్యేక దృష్టి**

తాజాగా జరుగుతున్న రిజిస్ట్రేషన్ విలువల సవరణ ప్రక్రియలో భాగంగా వాణిజ్య ప్రాంతాలపై రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. గతంలో సవరణ జరిగినప్పుడు అప్పటివరకు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టుగా నిర్ధారణ అయిన డోర్ నంబర్ల విలువలను మాత్రమే వాణిజ్య కేటగిరీలో పరిగణనలోకి తీసుకున్నారు. కానీ ఇప్పుడు వాణిజ్య డోర్ నంబర్లను ముందే ప్రత్యేకంగా నమోదు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

నగర, పట్టణ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉండే వాణిజ్య సముదాయాలన్నింటికీ సంబంధించిన విలువల సవరణ ఆటోమేటిక్‌గా జరిగేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్రంలోని ఏ ఒక్క కమర్షియల్ డోర్ నంబర్ తప్పిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని క్షేత్రస్థాయి కమిటీలకు వచ్చిన ఆదేశాల మేరకు చాలా పకడ్బందీగా వాణిజ్య ప్రాంతాల్లోని రిజిస్ట్రేషన్ విలువల సవరణ జరుగుతోంది.

**తక్కువ ఉన్న చోట భారీగా..**

సవరణ ప్రక్రియకు రిజిస్ట్రేషన్ల శాఖ కొన్ని నిబంధనలను రూపొందించుకుంది. వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తులు, నివాస స్థలాలకు సంబంధించి బహిరంగ మార్కెట్‌లో ఉన్న విలువను ప్రాతిపదికగా తీసుకుంటోంది.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301.
and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com